బుధవారం
13-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 84
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉత్తమ కమ్యూనిస్టు మునీర్ హమేర్నే

జోర్డాన్ కమ్యూనిస్టు నేత మృతికి ఈజిప్టు కమ్యూనిస్టు పార్టీ సంతాపం

జోర్డాన్ కమ్యూనిస్టు నేత, మేధావి మునీర్ హమేర్నే కన్నుమూశారు. ఈమేరకు జార్డన్ కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. ఆయన మృతి తీరని లోటని పేర్కొంది.

2 లో

ఎందుకీ ప్రత్యేకం

ఐదు రోజుల పార్లమెంటు సమావేశాల ఉద్దేశం ఏమిటి?

పార్లమెంటు 'ప్రత్యేక సమావేశాలు' అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనే కాదు, దేశ ప్రజల్లో చర్చనీయాంశమైంది. అసలు ఈ సమావేశాల అజెండా ఏమిటన్నదే ప్రశ్న. ఐదు రోజుల ఈ సమావేశం ఏ సమస్యలపై చర్చిస్తుంది? ఎవరికీ తెలియదు, మంత్రివర్గానికి కూడా. ఇది ఇప్పుడు మరింత చర్చనీయాంశం. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ, ఏకపక్ష వైఖరిని తేటతెల్లం చేసే మరో అంశమిది. ప్రభుత్వం పార్లమెంటరీ రూపమైన సమష్టి బాధ్యతకు దూరంగా భిన్నంగా వ్యవహరిస్తోంది.

- ప్రజా సమస్యలపై చర్చా... అంతకుమించా...
- 'జమిలి' పైనా... 'భారత్' పేరు మార్పు పైనా...
- మంత్రివర్గానికీ తెలియదా?

న్యూఢిల్లీ : నవంబరులో శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలకు మరో సమయం లేనట్లే. మళ్లీ ఈ నెల ఎందుకు?. 'పాత పార్లమెంటు భవనానికి వీడ్కోలు చెప్పేందుకు ఉభయ సభల సంయుక్త సమావేశం?' అనే శీర్షికతో శనివారం ఒక నివేదిక ప్రచురితమైంది. దీనిపై మరోసారి ప్రశ్న ఉత్పన్నం కావడం సాధారణమే. ఎందుకంటే ప్రత్యేక సమావేశాల అజెండా ఏమిటో కొందరికే తెలుసు. ఆ వార్తా నివేదిక ప్రకారం, ఐదు రోజుల ప్రత్యేక సమావేశానికి ముందు, ప్రస్తుత పార్లమెంటు భవనానికి వీడ్కోలు పలికేందుకు ఉభయ సభల సంయుక్త సమావేశం సెప్టెంబరు 19న ప్రసిద్ధ సెంట్రల్ హాలులో ఏర్పాటు చేస్తారా లేదా అనే దానిపై గణనీయమైన ఊహాగానాలు ఉన్నాయి' అని పేర్కొంది. ఒక భవనానికి వీడ్కోలు చెప్పడానికి ఐదు రోజులు ఎందుకు అవసరం? చట్టాలు, మార్పులను బహిరంగంగా, పారదర్శకంగా చర్చించాల్సిన ప్రజాస్వామ్యంలో 'గణనీయమైన ఊహాగానాలు' ఎందుకు అవసరం?. ఈ ప్రత్యేక సమావేశాలు ఆగస్టు 31న మొదటిసారిగా ప్రకటించినప్పుడు, ఆగస్టు 11న ఒక సమావేశం ముగిసిన కొద్దిసేపటికే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనే దానిపై ఊహాత్మక ఆట మొదలైంది. శీతాకాల సమావేశాలు నవంబరులో ప్రారంభమవుతాయి. అందువల్ల, అది ఉన్నట్లు కాదు. పార్లమెంటు సమావేశానికి మరో సమయం లేదు. మళ్లీ ఈ నెల ఎందుకు? దేశం పేరును ఇండియా నుంచి భారత్‌గా మార్చాలని కొందరు అన్నారు. కొన్ని రోజులుగా మీడియా దృష్టి దానిపైకి వెళ్లింది. మంత్రులు ఈ చర్యను సమర్థించారు. ఇందులో తప్పేమీ లేదని చెప్పారు. కానీ దేశం పేరులో మార్పు కోసమే ఈ ఈ సమావేశాలను నిర్వహిస్తున్నారా, కాదా అనేది మాత్రం నిర్ధారించలేకపోయారు. ఇక మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి సంబంధించినదని మరో అంచనా. ఇది వాస్తవానికి 2008లో రాజ్యసభలో ఆమోదం పొందింది. అయితే అప్పటి నుంచి అట్టడుగు వర్గాలకు ఈ వర్గంలో ఉప రిజర్వేషన్ల మద్దతు లేకపోవడం, డిమాండ్ల కారణంగా ఇది నిలిచిపోయింది. ఇది అజెండాలో ఉండి జరిగితే లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలోని మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు మహిళలకు

- మిగతా 2 లో

చంద్రబాబుకు జైల్లోనే భద్రత

- సీఐడీ వాదనతో ఏకీభవించిన ఏసీబీ కోర్టు
- హౌస్ కస్టడీ పిటిషన్ తిరస్కరణ
- కేసు పత్రాల పరిశీలనకు అనుమతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ నైపుణ్యాభివృద్ధి కుంభకోణం కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హౌస్ కస్టడీపై ఏసీబీ కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. జైలు రిమాండ్‌ను హౌస్ రిమాండ్‌గా మార్చాలన్న చంద్రబాబు పిటిషన్‌ను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి తిరస్కరించారు. హౌస్ కస్టడీ కంటే జైల్లోనే భద్రత ఎక్కువగా ఉంటుందన్న సీఐడీ వాదనలతో ఏకీభవిస్తున్నట్లు న్యాయమూర్తి వెల్లడించారు. ఎన్ఎస్‌జీ భద్రత గల వ్యక్తికి ఓ ఇంటి వద్ద ఆ స్థాయి భద్రత కల్పించలేమని పేర్కొంటూ హౌస్ రిమాండ్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. చంద్రబాబుకు రాజమండ్రి కేంద్ర కారాగారంలో భద్రతలేదని, ప్రాణహాని ఉందని ఆయన తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఏసీబీ కోర్టులో హౌస్ కస్టడీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. 'చంద్రబాబుకు జైలులో ప్రమాదం పొంచి ఉంది. ఆయన ఇప్పటివరకు ఎన్ఎస్‌జీ భద్రతలో ఉన్నారు. ప్రస్తుతం చంద్రబాబుకు జైలులో కల్పించిన భద్రతపై అనుమానం ఉంది. ఇప్పటికే ఆయనకు ప్రభుత్వం భద్రతను కుదించింది. సెంట్రల్ జైలులో కరడుగట్టిన నేరస్తులు

- మిగతా 2 లో

చంద్రబాబు అరెస్టు అక్రమం

- హైకోర్టులో దమ్మాలపాటి శ్రీనివాస్ లంచ్ మోషన్ పిటిషన్
- నేడు విచారిస్తానన్న న్యాయమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేసిన తీరు అక్రమమని మాజీ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ ఆంధ్ర ప్రదేశ్

- మిగతా 2 లో

చంద్రబాబు అరెస్టుపై సినీ పరిశ్రమ స్పందనేది?

నిర్మాత నట్టికుమార్ ఆవేదన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుపై సినీ పరిశ్రమ స్పందించకపోవడం దారుణమని సినీ నిర్మాత నట్టికుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన

- మిగతా 2 లో

మరో రూ.2 వేల కోట్ల అప్పు

ఏప్రిల్ నుంచి రూ.40,500 కోట్లకు చేరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం అప్పులను క్రమక్రమంగా పెంచుకుంటూ పోతోంది. ఇప్పటికే వేల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం తాజాగా మంగళవారం మరో రెండు వేల కోట్లు అప్పు తీసుకొచ్చింది. సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రిజర్వ్ బ్యాంక్‌లో అప్పు తీసుకుంది. వీటిలో రూ.వెయ్యి కోట్లు 15 సంవత్సరాలకు 7.48 శాతం వడ్డీతో చెల్లించే విధంగా మరో వెయ్యి కోట్లు 7.46 శాతం వడ్డీతో 18 సంవత్సరాలకు చెల్లింపులు చేసే ఒప్పందంపై రుణం తీసుకుంది. ఈ 2 వేల కోట్ల రూపాయలతో ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.40, 500 కోట్లకు చేరింది.

ఇవి కాకుండా కార్పొరేషన్‌ల ద్వారా మరో రూ.20 వేల కోట్లు అప్పు తెచ్చింది. ఉపాధ్యాయులు, పెన్షనర్లతో పాటు వివిధ శాఖల్లోని ఉద్యోగులకు 10వ తేదీ దాటినా ఇంకా చాలా మందికి జీతాలు, పెన్షన్లు చెల్లించని పరిస్థితి నెలకొంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ తక్షణ కర్తవ్యం

- అందరూ భాగస్వాములు కావాలి
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు
- 17,18 తేదీల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజాస్వామ్య పరిరక్షణకు బలమైన ప్రజాఉద్యమం రావాల్సిన అవసరం ఉందని, ఈ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, ప్రజాఉద్యమాలపై పోలీసుల అణచివేత చర్యలను నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంఘాల నాయకులను, ప్రతిపక్ష పార్టీల నేతలను అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఖండించారు. చలో అసెంబ్లీకి పిలుపునిస్తే నాయకులను బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలోనే అడ్డుకుంటున్నారని, గృహనిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయని విమర్శించారు. ఏ సంఘానికైనా, ఏ రాజకీయ పార్టీకైనా నిరసన తెలిపే హక్కు ఉందని ఆయన స్పష్టంచేశారు. అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమమే చేయకూడదనటం పాలకుల నిరంకుశత్వానికి నిదర్శనమని రామకృష్ణ విమర్శించారు. కక్ష సాధింపే లక్ష్యంగా జగన్ పాలన సాగుతోందని ఆరోపించారు. తప్పు చేస్తే ఏసీబీ, విజిలెన్స్, సీఐడీతో విచారణ చేయించవచ్చని, కానీ దురుద్దేశంతో అక్రమ అరెస్టులకు పాల్పడటం ఘోరమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టుపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలుపుతున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించడం రాజ్యాంగ హక్కులను కాలరాయటమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సెప్టెంబరు 17వ తేదీన పాత జిల్లా కేంద్రాల్లో, 18వ తేదీన కొత్త జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, ఆ సమావేశాలకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, యువజన, విద్యార్థి, కులసంఘాల నాయకులను ఆహ్వానించాలని తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

విదేశీసంస్థలు రావు: బోండా

సీమెన్స్ అనే అంతర్జాతీయ కంపెనీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చిన పథకంలో అవినీతి జరిగిందని ఆధారాలు

- మిగతా 2 లో

అంత ఖర్చెందుకు!

- జీ20 సమావేశాలకు అధిక వ్యయం
- కేటాయించిన దానికన్నా మూడు రెట్లు ఎక్కువ
- కాషాయ సర్కార్‌పై విమర్శలు

న్యూఢిల్లీ: ఎన్డీయే ప్రభుత్వ హయాంలో అనవసర వ్యయం ఎక్కువైపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీ20 శిఖరాగ్ర సమావేశం కోసం మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన మొత్తానికి 300 శాతం అధికంగా ఖర్చుచేసిందని సామాజిక మాధ్యమాలలో ఒక పోస్టు వెలుగులోకి వచ్చింది. అయితే, ఈ ఆరోపణలలో వాస్తవంలేదని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం బుకాయించింది. ఈ సమావేశానికి ఏకంగా రూ. 4100 కోట్లు ఖర్చు చేయడం విమర్శలకు తావిస్తోంది. బడ్జెట్ కేటాయింపుల కంటే మూడు రెట్లు అధికంగా వెచ్చించడం దుబారాను తలపిస్తోంది.దేశ రాజధాని ఢిల్లీ వేదికగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గడప గడపకు అయిపోవచ్చింది. తిట్లు, శాపనార్థాలు తప్ప వేరేం గుర్తురావడం లేదు!

లిబియాకు వరద పోటు

ప్రకృతి విపత్తులతో ప్రపంచం అల్లకల్లోలంగా మారింది. తూర్పు లిబియాకు వరద పోటెత్తగా మూడువేల మంది మృతిచెందారు. మరో 10వేల మంది గల్లంతు కాగా ఇంకో 20 వేల మంది నిరాశ్రులయ్యారు. రెండు డ్యామ్‌లు కూలిపోగా మూడు వంతెనలు, చట్టుపక్కల ఊళ్లు నీటిలో కొట్టుకుపోయాయి.

2లో

కేరళలో నిఫా కలకలం

- ఇద్దరి మృతి-ఐసీయూలో మరొకరు
- రాష్ట్రానికి కేంద్ర నిపుణుల బృందం

2లో

కేరళలో నిఫా వైరస్ కలకలం సృష్టించింది. ఈ వైరస్ కారణంగా కోజికోడ్ జిల్లాలో ఇద్దరు మరణించారు. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుఖ్ మాండవియా మంగళవారం ధ్రువీకరించారు.

40 శాతం ఎంపీలు నేరచరితులు

- 25 శాతం మందిపై తీవ్ర నేరారోపణలు
- 763 మంది ఆస్తి విలువ రూ.29,251 కోట్లు
- ఏడీఆర్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య దేశంలో ప్రజలను ఉద్ధరించడానికి, చట్టాలు చేయడానికి పార్లమెంటుకు ఎన్నికైన సభ్యుల్లో 40 శాతం మంది నేరస్తులు ఉన్నారు. అందులో 25 శాతం మందిపై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయి. హత్యలు, అత్యాచార యత్నం, కిడ్నాప్‌లు, మహిళపై నేరాలు వంటి తీవ్రమైన ఆరోపణలు గల నేతలు ఎంపీలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభకు సంబంధించిన ఎంపీల సరాసరి ఆస్తి విలువ రూ.38.33 కోట్లు. 53 మంది బిలియనీర్లు ఉన్నారు. లోక్‌సభ, రాజ్యసభలకు కలిపి మొత్తం 776 మంది ఎంపీలు ఉండగా అందులో 763 మంది ఎన్నికల వేళ దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్(ఎన్ఈడబ్ల్యూ) ఈ వివరాలు వెల్లడించాయి. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో నామినేషన్ సందర్భంగా ఎంపీలు ఈ అఫిడవిట్లు దాఖలు చేశారు. అప్పుడప్పుడు జరిగిన ఉప ఎన్నికల సమయంలోనూ ఎంపీలు అఫిడవిట్లు దాఖలు చేశారు. ప్రస్తుతం నాలుగు లోక్‌సభ సీట్లు, ఒక రాజ్యసభ సీటు ఖాళీగా ఉన్నాయి. ఒక లోక్‌సభ ఎంపీ, ముగ్గురు రాజ్యసభ ఎంపీల అఫిడవిట్లు అందుబాటులో లేకపోవడంతో...వాటిని విశ్లేషించలేదని ఏడీఆర్ తెలిపింది. 763 మంది ఎంపీల అఫిడవిట్లు విశ్లేషించగా 306 మంది(40 శాతం) ఎంపీలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 194(25 శాతం) మందిపై తీవ్రమైన నేరాలు అంటే హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాలు ఉన్నాయి. ఉభయసభల సభ్యుల విషయాన్ని పరిశీలిస్తే కేరళకు చెందిన 29 మంది ఎంపీలలో 23(79శాతం)

- మిగతా 2 లో

లిబియాకు వరద పోటు

3వేల మంది మృతి

10వేల మంది గల్లంతు

నిరాశ్రయులైన 20వేల మంది

శవాలదిబ్బగా డేర్నా నగరం

ట్రిపోలి: ప్రకృతి విపత్తులతో ప్రపంచం అల్లకల్లోలంగా మారింది. తూర్పు లిబియాకు వరద పోటెత్తగా మూడువేల మంది మృతిచెందారు. మరో 10వేల మంది గల్లంతు కాగా ఇంకో 20 వేల మంది నిరాశ్రులయ్యారు. రెండు డ్యామ్‌లు కూలిపోగా మూడు వంతెనలు,చట్టుపక్కల ఊళ్లు నీటిలో కొట్టుకుపోయాయి. అటు మొరాకో భూకంప మృతుల సంఖ్య 3వేలకు పెరిగింది. వేలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య అంతకంతకు పెరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా తూర్పు లిబియా, డేర్నా నగరం అతలాకుతలమైంది. ఆనకట్టలు కూలి వరద పోటెత్తగా నగరం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ఒక్క డేర్నాలో ఆరు వేల మంది ఆచూకీ లేరని స్థానిక మీడియా తెలిపింది. భారీ వృక్షాలు కూలిపోగా విద్యుత్, కమ్యూనిస్టు వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిసింది. అనేక ఇళ్లు కూలిపోయి సుమారు 20వేల మంది నిరాశ్రయులయ్యారు. అధికారులు టీవీ మాధ్యమంగా స్థానిక పరిస్థితులను వెల్లడించారు. చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయని, అనేక మృతదేశాలు బురదలో కూరుకుపోయి ఉన్నాయని లిబియా ఆరోగ్య మంత్రి ఒత్మాన్ అబ్దుల్‌జలీల్ తెలిపారు. డెర్నాలో పర్యటించిన ఆయన ఆ నగరం దయ్యాల దిబ్బగా మారిందని చెప్పారు. విపత్తుకర పరిస్థితులు నెలకొన్నాయని, ఆసుపత్రులన్నీ శవాలతో నిండిపోయాయని తెలిపారు. ఇంకా చాలా కుటుంబాలు చిక్కుకుపోయి ఉన్నాయని తెలిపారు. చాలా మంది సముద్రంలోకి కొట్టుకుపోయారన్నారు. కాగా, ఇటీవల గ్రీస్‌ను అల్లాడించిన డానియల్ తుపాను ఆదివారం మధ్యధార సముద్రాన్ని దాటింది. తీర నగరమైన డెర్నాను నాశనం చేసింది. రెండు ఆనకట్టలు ధ్వంసం కాగా దిగువగా నీరు పోటెత్తింది. నీటి ప్రవాహానికి మూడు వంతెనలు కొట్టుకుపోయాయి. చుట్టుపక్కల ఊర్లు, ప్రజలు సముద్రంలోకి కొట్టుకుపోయినట్లు లిబియన్ నేషనల్ ఆర్మీ (ఎల్ఎన్ఏ) అధికార ప్రతినిధి అహ్మద్ మిస్మారీ తెలిపారు.

మమ్మల్ని ఆదుకోండి...

ఈ ఆపద సమయంలో తమను అండగా నిలవాలని అంతర్జాతీయ సమాజానికి లిబియా విజ్ఞప్తిచేసింది. 'సోదరులు, స్నేహితులారా! మాకు సాయం చేయండి. ఆదుకోండి. విపత్తుకర పరిస్థితులను ఎదుర్కొంటున్నాం' అని అంతర్జాతీయ సమాజానికి ఆ దేశప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. లిబియాకు ఐరాస అధికారి జార్జెట్ గానన్ కూడా లిబియాకు అండగా నిలవాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ భాగస్వామ్యదేశాలకు కలిసి కట్టుగా లిబియాను ఆదుకోవాలని కోరారు. తీవ్రప్రభావిత ప్రాంతాలకు సాయం అందించాలని సూచించారు.

సోదర దేశాల ఆపన్నహస్తం

లిబియాకు తమ వంతు తోడ్పాటు అందించేందుకు ఈజిప్టు, టర్కీ, యూఏఈ, అల్జీరియా, ఇరాక్ ముందుకొచ్చాయి. ఇప్పటికే మిలటరీ కమాండర్లను పంపినట్లు ఈజిప్టు అధ్యక్షుడు అబ్దల్ ఫత్తా అల్ సిసీ ప్రకటించారు. బాధితులకు సహాయ సహకారాలను అందించేందుకు అవసరమైన తోడ్పాటును లిబియా దళాలకు తమ సైన్యం అందిస్తుందని చెప్పారు. అటు టర్కీ కూడా సహాయ సామ్రాగిని లిబియాకు చేర్చించి. సర్చ్ & రెస్క్యూ బృందాలు, సహాయ సామాగ్రితో వెళ్లిన విమానం లిబియా చేరుకున్నట్లు టర్కీ మీడియా తెలిపింది. తమ మిత్ర, సోదర దేశానికి తమ వంతు సాయం చేస్తామని, మరింత సహాయ సమాగ్రిని పంపుతున్నామని టర్కీ రక్షణ శాఖ ప్రకటన చేసింది. మానవతా సాయాన్ని అందిస్తామని అబుదాబీ ప్రకటన చేసింది. అల్జీరియా, ఇరాక్ కూడా తమ వంతు సాయం చేస్తామని తూర్పు లిబియాకు హామీనిచ్చాయి.

ఉత్తమ కమ్యూనిస్టు మునీర్ హామేర్నే

జోర్డాన్ కమ్యూనిస్టు నేత మృతికి ఈజిప్టు కమ్యూనిస్టు పార్టీ సంతాపం

కైరో: జోర్డాన్ కమ్యూనిస్టు నేత, మేధావి మునీర్ హామేర్నే కన్నుమూశారు. ఈమేరకు జార్డన్ కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. ఆయన మృతి తీరని లోటని పేర్కొంది. మునీర్ హామేర్నే మరణం వార్త కలచివేసిం దని ఈజిప్టు కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సలా అద్లీ ఒక ప్రకటనలో వెల్లడించారు. మునీర్ హామేర్నే మానవతావాది, చారిత్రక నాయకుడు, ఉద్యమ సారధి, స్వాతంత్ర్య యోధుడని కొనియాడారు. సోషలిజం కోసం పాటుపడిన ఉత్తమ కమ్యూనిస్టు అని శ్లాఘిం చారు. జోర్డాన్ కమ్యూనిస్టుల ఐక్యతకు పునరంకితమై పనిచేశారని గుర్తుచేశారు. పలస్తీనా ప్రజల న్యాయబద్ధ హక్కుల పోరాటానికి ఎల్లప్పుడు అండగా నిలిచారని వెల్లడించారు. కష్టమొచ్చినట్లు కన్నీళ్లు తుడిచే... ఆపదవచ్చినప్పుడు అండగా నిలబడే నిజమైన కామ్రేడ్‌గా మునీర్ ప్రఖ్యాతిగాంచారని, ఆయన మరణం జోర్డాన్ కమ్యూనిస్టు పార్టీకి, మేధావి వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. జోర్డాన్ కమ్యూనిస్టు పార్టీతో పాటు మునీర్ సతీమణి, యోధురాలు లైలా నఫ్పాకు, అరబ్‌కు, అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక పార్టీలకు ప్రగాఢ సానుభూతిని సలా అద్లీ ప్రకటించారు.

మైనారిటీల హక్కుల

పరిరక్షణకు రెట్టింపు చర్యలు

భారత్‌కు ఐరాస మానవహక్కుల అధ్యక్షుడి పిలుపు

న్యూదిల్లీ: భారత్‌లో అణగారిన వర్గాలు, మైనారిటీలపై వివక్ష, హింస పేట్రేగిపోయిందని ఐరాస మానవ హక్కుల అధ్యక్షుడు వోల్కర్ తుర్క్ తెలిపారు. మైనారిటీల హక్కుల పరిరక్షణకు రెట్టింపు చర్యలు తీసుకోవాలని భారత్‌కు పిలుపునిచ్చారు. అసహనాన్ని, విద్వేష ప్రసంగాలు, మతోన్మాదాన్ని, వివక్షను తక్షణమే అణచివేయాలని సూచించారు. 54వ ఐరాస మానవహక్కుల మండలి సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచవ్యాప్తంగా మానవహక్కుల పరిస్థితిపై మౌఖిక నివేదిక ప్రవేశపెట్టారు. భారత్ నుంచి పెరూ వరకు, సాహెల్ ప్రాంతం నుంచి పాకిస్తాన్ వరకు మానవహక్కుల పరిస్థితిని వెల్లడించారు. భారత్‌లో మైనారిటీ వర్గీయులపై వివక్ష, హింసకు సంబంధించిన సమాచారం తరచూ తమ కార్యాలయానికి వస్తుంటుందని టర్క్ తెలిపారు. ముస్లింలనే ఎక్కువగా లక్ష్యంగా చేసుకుంటుంటారని చెబుతూ ఉత్తర భారతంలోని హరియాణా, గురుగ్రామ్‌లో జరిగిన తాజా ఘటనలను ఉదహరించారు. విశ్వ హిందూ పరిషత్ అధ్వర్యంలో జరిగిన ఊరేగింపు కారణంగా హరియాణాలో ఘర్షణలు జరిగాయి. ఏడుగురు చనిపోగా 200 మందికి గాయాలయ్యాయి. వారం పాటు అల్లర్లు కొనసాగాయి. గిరిజన వర్గాల మధ్య ఘర్షణతో ఈశాన్య రాష్ట్రంలో తగలబడిపోయింది. మణిపూర్‌లో ఇతర వర్గాలు హింసను ఎదుర్కొన్నారు. మే నుంచి అక్కడి ప్రజల్లో అభద్రతా భావం ఉంది. ఇప్పటివరకు 200 మంది చనిపోగా 70వేల మందికిపైగా నిరాశ్రయులు అయినట్లు నివేదికలు చెబుతున్నాయ'ని టర్క్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో భారత్‌లో తక్షణమే అసహనాన్ని, విద్వేషాన్ని, మతోన్మాదాన్ని కట్టడి చేసేందుకు రెట్టింపు కసరత్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు.

40 శాతం ఎంపీలు నేర చరితులు

(మొదటిపేజీ తరువాయి)

మంది, బీహార్‌కు చెందిన 56 మంది ఎంపీలలో41(73 శాతం) మంది, మహారాష్ట్రకు సంబంధించి 65 మంది ఎంపీలలో 37(57శాతం) మంది, తెలంగాణకు చెందిన 24 మంది ఎంపీలలో 13(54 శాతం) మంది, దిల్లీ నుంచి 10 మంది ఎంపీలలో 5(50శాతం) మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని ఏడీఆర్ వివరించింది. 56 మంది బీహార్ ఎంపీలలో 28 మంది, 24 మంది తెలంగాణ ఎంపీలలో 9 మంది, 29 మంది కేరళ ఎంపీలలో 10 మంది, 65 మంది మహారాష్ట్ర ఎంపీలలో 22 మంది, 108 మంది ఉత్తరప్రదేశ్ ఎంపీలలో 37 మందిపై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయి.

బీజేపీకి చెందిన మొత్తం 385 మంది ఎంపీలలో 139 (36 శాతం) మంది ఎంపీలు, 81 మంది కాంగ్రెస్ ఎంపీలలో 43 (53శాతం) మంది, 36 మంది తృణమూల్ ఎంపీలలో 14 మంది ఎంపీలు, ఆర్‌జేడీకి చెందిన ఆరుగురు ఎంపీలలో ఐదుగురు, 8 మంది సీపీఎం ఎంపీలలో ఆరుగురు, 11 మంది ఆప్ ఎంపీలలో ముగ్గురు, 31 మంది వైసీపీ ఎంపీలలో 13 మంది(42 శాతం)పై క్రిమినల్ కేసులు నమోదైనట్లు ఏడీఆర్ వివరించింది. ఇక తీవ్రమైన ఆరోపణలకు సంబంధించి పరిశీలిస్తే బీజేపీ ఎంపీలు 25శాతం, కాంగ్రెస్ ఎంపీలు 32 శాతం, తృణమూల్ ఎంపీలు ఏడుశాతం, వైసీపీ ఎంపీలు 35 శాతం మందిపై కేసులు ఉన్నాయి. 11 మంది సిట్టింగ్ ఎంపీలపై హత్య కేసులు, 32 మంది సిట్టింగ్ ఎంపీలపై హత్యాయత్నం కేసు, 21 మంది సిట్టింగ్ ఎంపీలపై మహిళలకు సంబంధించిన నేరాలు నమోదయ్యాయి. అత్యంత ధనికులైన ఎంపీల విషయాన్ని పరిశీలిస్తే తెలంగాణకు చెందిన 24 మంది ఎంపీలలో సగటు ఆస్తి రూ.262.26 కోట్లు కాగా 36 మంది ఆంధ్రప్రదేశ్ ఎంపీల సరాసరి ఆస్తి విలువ రూ.150.76 కోట్లుగా నిర్ధారణ అయింది. పంజాబ్ ఎంపీల సగటు ఆస్తి విలువ రూ.88.94 కోట్లు. అతి తక్కువ ఆస్తి గల ఎంపీల విషయానికి వస్తే...లక్షద్వీప్ ఎంపీ ఆస్తివిలువ రూ.9.38 లక్షలు కాగా త్రిపురలోని ముగ్గురు ఎంపీల సగటు ఆస్తి రూ.1.09 కోట్లుగా తేలింది. మణిపూర్ ఎంపీల ఆస్తి విలువ రూ.1.12 కోట్లుగా ఏడీఆర్ వివరించింది. మొత్తం 763 మంది ఎంపీల ఆస్తి విలువ రూ.29,251 కోట్లుగా నిర్ధారణ అయింది.

అంత ఖర్చెందుకు!

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన జీ20 సమావేశాల విజయవంతం కోసం అధికారులు, వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులు గత కొద్దినెలలుగా విస్తృత ఏర్పాట్లు, సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. 'జీ20 సదస్సు కోసం బడ్జెట్‌లో కేటాయించిన దానికంటే ప్రభుత్వం 300 శాతం అదనంగా ఖర్చు చేసిందంటూ సోషల్ మీడియా పోస్టు వెలుగులోకి వచ్చింది. ఈ ఆరోపణల్లో వాస్తవం లేదు. ఆ వ్యయంలో అధిక భాగాన్ని ఐటీబీపీ(జీ20 సదస్సు వేదిక) వంటి సుదీర్ఘకాలం సేవలు అందించే ఆస్తుల కోసం కేటాయించారు. ఆ నిర్మాణాలు కేవలం ఒక్క జీ20 సదస్సుకే పరిమితం కావు' అని ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది.

ఈ సమావేశాలకు అనేక దేశాధినేతలు, ఉన్నతాధికారులు, పెద్దసంఖ్యలో ప్రతినిధులు తరలిరావడంతో దిల్లీని భద్రతా దళాలు, పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా అనేక దేశాధినేతలు హాజరయ్యారు. ఈ సమావేశాల నిర్వహణ కోసం భారత్ రూ. 4100 కోట్లు ఖర్చుచేసింది. జీ20 ప్రెసిడెన్సీ కోసం 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ990 కోట్లు కేటాయించగా వ్యయం అనుకున్న దానికన్నా మూడు రెట్లు పెరిగింది.

ఇక గతంలో జీ20 సమావేశాల నిర్వహణ కోసం ఎంత ఖర్చుచేశాయో పరిశీలిద్దాం. ఇండోనేసియా 2022లో సదస్సు నిర్వహణ కోసం రూ 364 కోట్ల ఖర్చు చేసింది. జపాన్ (2019) రూ 2660 కోట్లు, అర్జెంటీనా (2018) రూ. 931 కోట్లు, జర్మనీ (2017) రూ. 634 కోట్లు, ఆస్ట్రేలియా(2014) రూ. 2653 కోట్లు, రష్యా (2013) రూ. 170 కోట్లు, ఫ్రాన్స్ (2011) రూ. 712 కోట్లు, కెనడా (2010) రూ. 4351 కోట్లు వెచ్చించాయి. ఇక భారత్ జీ20 సమావేశాల నిర్వహణ కోసం మొత్తం 12 విభాగాల్లో రూ. 4100 కోట్లు ఖర్చు చేసినట్టు ప్రభుత్వ రికార్డులు తెలిపాయి. ఈ సమావేశాలకు అనుకున్నదానికంటే ప్రభుత్వం 300 శాతం అదనపు వ్యయం చయడంపై తృణమూల్ కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.990 కోట్లు కేటాయించిందని, కానీ రూ.4100 కోట్లు ఖర్చు పెట్టిందని తెలిపింది. ఇంత మొత్తం ఎక్కడికి వెళ్లిపోయిందని ప్రశ్నించింది. మోదీ వ్యక్తిగత ప్రచారం కోసం ప్రభుత్వం ఈ ఖర్చు చేసిందని.. దీనిని బీజేపీ ఎందుకు చెల్లించకూడదని తృణమూల్ నిలదీసింది.

ఎందుకీ 'ప్రత్యేకం'

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించబడుతుంది. ఒక గణనీయమైన సంస్కరణ అవుతుంది. ఇది నిజంగా ఈ చట్టమే అయితే, అది ఆమోదించబడుతుందని ఒకరు ఆశిస్తున్నారు. కానీ వాస్తవానికి ఎవరికీ తెలియదు. ఏ కారణం చేతనైనా ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలను ముందుగానే పిలుస్తోందని మీడియాలో మరో అంచనా. వచ్చే ఏడాది ఏప్రిల్-మేలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి, అంటే మరో ఏడెనిమిది నెలల్లో, కానీ 2004లో అతల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం చేసిన విధంగానే ముందడుగు వేయవచ్చు. అయితే ముందస్తు ఎన్నికలకు పిలుపునిచ్చేందుకు వాజ్‌పేయి చేసిన లబ్ధి పొందే చర్య విజయవంతం కాలేదు. ప్రభుత్వం పడిపోయింది. అందువల్ల ఈ విషయంలో జాగ్రత్తగా ఉండొచ్చు. 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' అని పిలవబడే దాని గురించి అత్యంత తీవ్రమైన ఊహాగానాలు ఉన్నాయి. ఈ వ్యవస్థ ప్రకారం అన్ని రాష్ట్రాలు, కేంద్రం ప్రతి ఐదేళ్లకు ఒకసారి కలిసి ఎన్నికలకు వెళతాయి. పౌరులు ఒకే సమయంలో అసెంబ్లీ, లోక్‌సభకు ఓటు వేస్తారు. కార్పొరేషన్ ఎన్నికలను కూడా కలుపుతారా?. ఉప ఎన్నికల సంగతేంటి?. బహుళ ఎన్నికల కోసం ఈవీఎంలను ఎలా ఏర్పాటు చేస్తారు? ఎవరికీ తెలియదు. అయితే ఈ ఆలోచనను పరిశీలించడానికి మాజీ రాష్ట్రపతి అధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఈ ప్రత్యేక సమావేశాల్లో ఎలా సమావేశమై దాని ఫలితాలను ఎలా ఇస్తుందో అస్పష్టంగా ఉంది. మీడియాలో వచ్చిన మరో కథనం ఏమిటంటే, రిజర్వేషన్లు మరింత సమంజసంగా ఉండేలా ఓబీసీల ఉప వర్గీకరణను పరిశీలించడానికి 2017లో ఏర్పాటయిన కమిషన్ గురించి ఈ సమావేశాల్లో ఉండవచ్చునని పేర్కొంది.

పార్లమెంటరీ రూపానికి దూరంగా మోదీ సర్కార్

ప్రభుత్వం పార్లమెంటరీ రూపం దానితో సమష్టి బాధ్యత అని పిలవబడుతుంది. అంటే నిర్ణయాలు ఉమ్మడిగా యాజమాన్యంలో ఉంటాయి. అయితే ఇక్కడ కేంద్ర మంత్రివర్గం నిర్ణయాల విషయంలో మిగిలిన వారిలాగే చీకటిలో ఉంది. దీన్ని నిరూపించడానికి గతంలోని రెండు ఉదాహరణలు సరిపోతాయి. మొదటిది 2016 నవంబరు 10 నుంచి వచ్చిన నివేదిక, 'మీ ఫోన్లు తీసుకురావద్దు' అనేది. మోదీ మంత్రివర్గం సమావేశం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దేశంలో పెద్ద నోట్ల రద్దు గురించి కేంద్ర మంత్రులు అదే రోజు తెలుసుకున్నారని, అంటే ఆ అంశాన్ని చర్చించలేదని నివేదిక పేర్కొంది. 2020 జాతీయ లాక్‌డౌన్ గురించి ప్రభుత్వంతో 240కి పైగా సమాచార హక్కు ప్రశ్నలను బీబీసీ వార్తా సంస్థ దాఖలు చేయడం మరొక ఉదాహరణ. ఇది కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, ఆర్థిక, విపత్తు నిర్వహణ, మిగిలిన విభాగాలను లాక్‌డౌన్‌కు సంబంధించి వారికి ఏమి తెలుసు, వారు ఎలా సిద్ధం చేశారనే దాని గురించి అడిగింది. తమకు తెలియదని, సిద్ధం కాలేదని సమాధానం వచ్చింది.

అంతా దాచిపెట్టే వైఖరే!

మంత్రివర్గంలో రహస్యాలు, ప్రధాన నిర్ణయాలను దాచిపెట్టే ఈ రకమైన ప్రభుత్వం కొనసాగుతోంది. అందుకే ఈ ప్రత్యేక సమావేశాల చుట్టూ ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయం ఉండదు. అలాంటప్పుడు ఇది అవసరం లేదు. లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పలేదు కాబట్టి వాటిని అడగకుండా ఆపడం ఏమిటి? ఈ సమావేశంలో చర్చించాలనుకుంటున్న అంశాల జాబితాను ప్రతిపక్షాలు పంపించాయి. వీటిలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతులకు కనీస మద్దతు ధర, మణిపూర్‌లో కొనసాగుతున్న హింస, అదానీ కుంభకోణం, భారతదేశం అంతటా మత ఉద్రిక్తతలు, లడఖ్, ఇతర ప్రాంతాలలో చైనా చర్యలు, కుల గణన (లేదా జనాభా గణన), అలాగే సమాఖ్యపై ఒత్తిడి, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల ప్రభావం. ఇవి ఇప్పటికే అజెండాలో లేవని భావించి, వాటిని ప్రభుత్వం చేపట్టే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రభుత్వం చెప్పేది ఎందుకు వినాలనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది.

కేరళలో నిఫా కలకలం

న్యూదిల్లీ: కేరళలో నిఫా వైరస్ కలకలం సృష్టించింది. ఈ వైరస్ కారణంగా కోజికోడ్ జిల్లాలో ఇద్దరు మరణించారు. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుఖ్ మాండవియా మంగళవారం ధ్రువీకరించారు. నిఫా వైరస్‌ను కట్టడి చేసేందుకు కేంద్రం తరపున నిపుణుల బృందాన్ని కేరళకు పంపినట్లు తెలిపారు. కోజికోడ్‌లో రెండు అసహజ మరణాలు సంభవించాయని కేరళ ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఇద్దరు జ్వరంతో బాధపడినట్లు పేర్కొంది. మృతుల్లో ఒకరి బంధువు ప్రైవేటు ఆసుపత్రి ఐసీయూలో ఉన్నట్లు వెల్లడించింది. జిల్లావ్యాప్తంగా అలర్ట్ ప్రకటించింది. రెండు మరణాలకు నిఫా వైరస్సే కారణమని నిర్ధారణ అయినట్లు మాండవియా విలేకరులతో చెప్పారు. వైరస్ సోకినట్లు అనుమానం ఉన్న నలుగురి నమూనాలను పూనేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. కోజికోడ్‌లో కంట్రోల్ రూమ్‌ను కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మాస్కులు ధరించాలని ప్రజలకు సూచించింది.

ఈ పరిస్థితిని తమ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మరణించిన వ్యక్తులకు దగ్గరగా ఉన్న వారంతా ప్రస్తుతం చికిత్స పొందుతున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కోజికోడ్ పరిస్థితిపై కేరళ ఆరోగ్య మంత్రి వీనా జార్జ్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. 2018, 2021లోనూ కోజికోడ్‌లో నిఫా వైరస్ మరణాలు సంభవించాయి. నిఫా వైరస్ అన్నది జంతువుల నుంచి మనుషులకు సోకుతుంది. ఇది జూనోటిక్ వ్యాధి అని, ఆహారం ద్వారా లేక ఒక వ్యక్తి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) పేర్కొంది.

చంద్రబాబుకు జైల్లోనే భద్రత

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. అందుకే చంద్రబాబును హౌస్ రిమాండ్‌కు ఇవ్వండి' అని సిద్ధార్థ లూథ్రా కోర్టులో వాదనలు వినిపించారు. మరోవైపు చంద్రబాబుకి హౌస్ కస్టడీ అక్కర్లేదని సీఐడీ తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. హౌస్ కస్టడీ అనేది సీఆర్పీసీలో లేదని, ఇల్లు కంటే జైలే ఉత్తమమని, అన్నివిధాలుగా భద్రత పటిష్టంగా ఉంటుందని ఆయన వాదించారు. చంద్రబాబు పూర్తి ఆరోగ్యం, పూర్తి భద్రత మధ్యే ఉన్నారని, రక్షణ విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని పొన్నవోలు కోర్టుకు చెప్పారు. రాజమండ్రి జైలు చుట్టూ ప్రహరీతో చాలా పటిష్టంగా ఉంటుందని, ఇక పిటిషనర్ ఆరోగ్యం కోసం 24 గంటలు అందుబాటులో ఉండేలా వైద్యులను ప్రభుత్వం నియమించిందని సుధాకర్ రెడ్డి చెప్పారు. రెండు వర్గాల సుదీర్ఘ వాదనలను విన్న ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సాయంత్రం 4:30 గంటలకు తీర్పును వెల్లడించారు. సీఐడీ వాదనలతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ చంద్రబాబు హౌస్ రిమాండ్ పిటిషన్‌ను తిరస్కరించారు.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు హౌస్ కస్టడీ పిటిషన్‌ను తిరస్కరించిన ఏసీబీ కోర్టు న్యాయమూర్తి... ఈ కేసు పత్రాల పరిశీలనకు మాత్రం అనుమతించారు. సోమవారం చంద్రబాబు హౌస్ కస్టడీకి సంబంధించిన పిటిషన్‌తో పాటు పత్రాల పరిశీలనకు అనుమతి కోరుతూ చంద్రబాబు తరపు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. నిన్న సాయంత్రానికే అనుమతి వస్తుందని న్యాయవాదులు భావించినప్పటికీ రాలేదు. కస్టడీ పిటిషన్‌పై తీర్పుతో పాటు దీనిని కూడా వాయిదా వేసి... దీనిపై మంగళవారం కేసు పత్రాల పరిశీలనకు అనుమతిస్తూ తీర్పు చెప్పారు.

సినీ పరిశ్రమ స్పందనేది?

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమ కోసం ముందుండే వ్యక్తి చంద్రబాబునాయుడు. ఓ వ్యక్తి కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉండటం మానవత్వం. సినీ పరిశ్రమ కోసం ఎంతో చేసిన వ్యక్తి కష్టాల్లో ఉన్నప్పుడు మద్దతుగా నిల బడితే వైఎస్ జగన్ ఏమన్నా ఉరితీస్తాడా అని ఆయన ప్రశ్నించారు. 'జూనియర్ ఎన్టీఆర్ సహా ఇతరులెవరూ మద్దతు ఇవ్వకపోవడం తనకు బాధ కలిగించింది. చంద్రబాబు చేసిన సేవలను గౌరవించి ఆయనకు అం డగా నిలబడాలి. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లోని నందమూ రి అభిమానులు ఎందుకు స్పందించడం లేదు. చిరం జీవి, రాజమౌళి, ప్రభాస్ లాంటి వ్యక్తులు మద్దతుగా ట్వీట్ చేసినా చాలు. ఇక వెనుకాల నుంచి సపోర్ట్ చేసేవాళ్లు అంతా దొంగలే. ముందుండి మద్దతు ఇచ్చిన హీరో పవన్ కళ్యాణ్. సినీ పరిశ్రమ పెద్దలు దొంగ ముసుగులు వేసుకోవద్దు. పవన్ కళ్యాణ్ పెద్ద కొడు కుగా ముందడుగు వేసి మద్దతు ఇచ్చారు. వాస్తవానికి నేను టీడీపీకి దూరం, చంద్రబాబు వ్యక్తితత్వానికి దగ్గర. చంద్రబాబులాంటి వ్యక్తి జైల్లో ఉండకూడదు, ప్రజల్లో ఉండాలి. వైఎస్ జగన్ ప్రజలకు ప్రమాదం. దేశంలో ఉన్న కేసుల్లో ఎక్కువగా రాజకీయ నాయకులపైనే ఉన్నాయి. చంద్రబాబు అంటే సినీ పరిశ్రమ, సినీ పరిశ్రమ అంటే చంద్రబాబు. చంద్రబాబు భోళా శంకరుడు. చంద్రబాబు ఏ రోజూ కక్ష సాధింపులు చేయలేదు. చంద్రబాబు ఏనాడు వైఎస్‌ను కక్షపూరితంగా చూడలేదని నట్టికుమార్ తెలిపారు.

చంద్రబాబు అరెస్టు అక్రమం

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టులో మంగళవారం మధ్యాహ్నం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్17ఎ ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోకుండా అరెస్టు చేయడం చట్ట విరుద్ధమని, ఈ ప్రక్రియ అంతా సరికాదని పేర్కొన్నారు. సీఐడీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై వాదనలు వినిపిస్తామని పిటిషన్‌లో దమ్మాలపాటి వివరించారు. అయితే దీనికి సంబంధించి విచారణ బుధవారం చేపడతామని హైకోర్టు న్యాయమూర్తి తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ తక్షణ కర్తవ్యం

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబుని అరెస్టు చేసి జైలుకు పంపితే...రానున్న రోజుల్లో విదేశీ సంస్థలు మన రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వస్తాయా అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బోండా ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి డబ్బు ఎక్కడకు వెళ్లిందో ఆధారం ఉందా అని నిలదీశారు. అమరావతి నిర్మాణంలో ఒక్క అవినీతి అంశం ఉన్నా నాలుగేళ్లు చూస్తూ ఉండేవారా? ఇది కేవలం ఒక వ్యక్తికో, పార్టీకో చెందిన విషయం కాదని, ప్రజాస్వామ్యానికి వచ్చిన ముప్పుగా గుర్తించాలని కోరారు.

పోలీసులు తప్పు చేస్తున్నారు: వర్ల రామయ్య

ప్రతిపక్ష నాయకుడిని అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపటం...1984లో నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్‌ను గద్దెదించిన ఘటన కంటే తక్కువది కాదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. నాదెండ్ల భాస్కరరావు చర్యకు వ్యతిరేకంగా నాడు పెద్దఎత్తున ప్రజాఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. ఎవరి కళ్లలో ఆనందం చూడటం కోసం డీఐజీ రాఘురామిరెడ్డి అలా వ్యవహరించారని ప్రశ్నించారు. సీఎం జగన్ ప్రతీకారమే లక్ష్యంగా రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

చంద్రబాబును లొంగదీసుకోవడానికి బీజేపీ ఎత్తుగడ: వడ్డే

చంద్రబాబును తన దారికి తెచ్చుకోవటం కోసం మోదీ ప్రభుత్వం ఈ వ్యవహారం నడిపిందని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. కోడికత్తి, వివేకానందరెడ్డి హత్య కేసులు పట్టించుకోకుండా ఎప్పటి కేసునో బయటకు తీసి జగన్‌కు మోదీ, అమిత్‌షా సహకరిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కవిత, బెంగాల్‌లో మమత ఇలా అనేక రాష్ట్రాల్లో నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు

జగన్ ధైర్యం మోదీ: శ్రీనివాసరావు

జగన్ అరాచక పాలన చేయటానికి ప్రధాని మోదీ ఇచ్చిన ధైర్యమే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. నిరంకుశత్వం దిల్లీలో ప్రారంభమైందని, ఒక్కో రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తూ మోదీ సర్కారు ముందుకుసాగుతోందన్నారు. అయినా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కటం ఎవరితరం కాదని ఆయన స్పష్టంచేశారు. మోదీకి, జగన్‌కు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

జగన్ ఆదేశాలు అమలు చేశారు: శ్రీనివాసరెడ్డి

చంద్రబాబును అరెస్టు చేయటానికి పోలీసులు పక్కా ప్రణాళిక అమలు చేశారని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పోలీసులకు చట్టం తెలిసినా సీఎం జగన్ ఆదేశాలు అమలు చేయకతప్పలేదని చెప్పారు. చంద్రబాబును అరెస్టు చేయటానికి వచ్చిన పోలీసులను తాము ప్రశించగా 'మేము మీకు సమాధానం చెప్పం. మేము వచ్చిన పని పూర్తి చేసుకుంటాం' అని చెప్పారన్నారు. చంద్రబాబు అరెస్టు సందర్భంగా జరిగిన పరిణామాలను ఆయన వివరించారు.

పదోన్నతుల కోసం: భానుప్రసాద్

పాలకులు ఎలాంటి నేరాలు చేసినా చర్యలు తీసుకోలేని స్థితిలో పోలీసులు ఉంటున్నారని లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు భానుప్రసాద్ అన్నారు. స్వతంత్ర భారతదేశంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. పదోన్నతుల కోసం రాజకీయ నాయకుల చేతుల్లో పోలీసులు పావుగా మారకూడదని హితవు పలికారు.

ప్రజాఉద్యమం రావాలి: ఓబులేసు

ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరిగినప్పుడు ప్రజాఉద్యమం రావాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఓబులేసు చెప్పారు. ధర్నాలో 500 మంది కంటే ఎక్కువమంది పాల్గొనకూడదని, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ఉండకూడదని, వారు రాజకీయాలు మాట్లాడతారని అంటూ ఉద్యమానికి పోలీసులు అడ్డుచెబుతున్నారని విమర్శించారు. ఈ తరహాలో మణిపూర్‌లోనూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా టీడీపీ నోరు విప్పాలని సూచించారు.

కక్షసాధింపుతోనే జగన్ పాలన ప్రారంభం: పోతిన

ప్రజావేదిక కూల్చటం ద్వారా కక్ష సాధింపుతో జగన్ పాలన ప్రాంభమైందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేశ్ ఆరోపించారు. ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టినా కేసులు పెడుతున్నారని, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. అవినీతి ఎలా చేయాలో జగన్ ద్వారా రాష్ట్ర ప్రజలకు తెలిసిందన్నారు. వైసీపీని ఓడించటం ద్వారానే ప్రజాస్వామ్యానికి రక్షణ సాధ్యమవుతోందన్నారు.

రాజకీయ పార్టీలు స్పందించాలి: వినయ్‌కుమార్

కేంద్రం తప్పు చేస్తే కొన్ని పార్టీలు మాట్లాడవు. రాష్ట్రం తప్పు చేస్తే మరికొన్ని పార్టీలు మాట్లాడటం లేదు. ప్రతి సందర్భంలో రాజకీయ పార్టీలు స్పందిస్తేనే ప్రజాస్వామ్యానికి రక్షణ అని కొరివి వినయ్‌కుమార్ చెప్పారు. జగన్ ప్రభుత్వంలో మనకు తెలియకుండానే కేసులు నమోదవుతున్నాయని, ఎస్సీ, ఎస్టీల పథకాలు రద్దయ్యాయని, అయినా ఎవరూ మాట్లాడటం లేదని చెప్పారు.

విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్‌లపై కేసులు: ఉమామహేశ్వరరావు

రాజ్యాంగం ద్వారా ప్రమాణం చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలను ప్రశ్నించాలని ప్రొఫెషనల్ ఫోరం రాష్ట్ర నాయకులు నేతి ఉమామహేశ్వరరావు సూచించారు. ఉద్యోగం నుంచి రిటైర్డు అయిన తరువాత అక్రమ సంపాదన గుర్తిస్తే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లపైనా కేసులు పెట్టాలన్నారు. మోదీ దత్త పుత్రుడు జగన్ అని వ్యాఖ్యానించారు.

ప్రజలను భయపెట్టే సందేశం: లక్ష్మారెడ్డి

చంద్రబాబును అరెస్టు చేశాం. త్వరలో రామోజీరావును అరెస్టు చేస్తాం. ఇక మీరెంత అని ప్రజలను భయపెట్టే సందేశం వైసీపీ ప్రభుత్వం ఇస్తోందని జన విజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి చెప్పారు. జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక కులానికి వ్యతిరేకంగా పని చేస్తే ఇతర కులాలు ఓట్లు వేస్తారా అనే సందేహం వ్యక్తం చేశారు.

మైనార్టీ నాయకులు షబ్లీ, అమరావతి రాజధాని జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్, అమరావతి దళిత జేఏసీ నాయకులు పి.బాలకోటయ్య, జైభీమ్ పార్టీ నాయకులు కొండలరావు, లోక్‌సత్తా పార్టీ నాయకురాలు మాలతి, నవక్రాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రావుల సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు పింగళి గిరిబాబు, సుంకర కృష్ణమూర్తి, ప్రజాసంఘాల నాయకులు భాస్కరరావు, భవానీశంకర్ మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, నేషనల్ నవక్రాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్‌తో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

తొలుత సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అతిథులకు స్వాగతం పలికారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ వందన సమర్పణ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలు ఆలపించారు.

జైళ్లు... పరివర్తన కేంద్రాలుగా ఉండాలి

గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర–విశాఖ కలెక్టరేట్: దేశవ్యాప్తంగా జైళ్లు పరివర్తన కేంద్రాలుగా ఉండాలని, సంస్కరణల దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభిప్రాయపడ్డారు. మంగళవారం విశాఖలోని ఓ హోటల్లో జరిగిన జైళ్ల అధిపతుల 8వ జాతీయ సదస్సులో గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

సమావేశాన్ని ఆయన ప్రారంభిస్తూ... ఖైదీల్లో పరివర్తన, సంస్కరణల దిశగా జైళ్లు ముందడుగు వేయాల న్నారు.ఈ సందర్భంగా పరివర్తన పుస్తకాన్ని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితతో కలిసి విడుదల చేశారు.

చంద్రబాబుకు పూర్తిస్థాయిలో భద్రత: హోంమంత్రి వనిత

హోంమంత్రి వనిత మాట్లాడుతూ... జైళ్లలో అన్ని రకాల నేరస్తులు ఉంటారని చెప్పారు. రాజమండ్రి జైలుల్లో చంద్ర బాబుకు పూర్తి భద్రత కల్పించామన్నారు. ఆయనకు ఇంటి భోజనం కూడా అందిస్తున్నారని, మావోయిస్టుల నుంచి జైలులో చంద్రబాబుకు ఏ ఇబ్బంది లేదన్నారు.ఆయన భద్రత ప్రభుత్వం బాధ్యత అని, చంద్ర బాబు ఉన్న జైలు గది పరిసరాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు అనుమతితోనే ఎవరినైనా ఆయన వద్దకు పంపించడం జరుగు తుందని, చంద్రబాబు సామాన్య వ్యక్తి కాదని, అన్ని సాక్ష్యాలతో అతన్ని సీఐడీ అరెస్టు చేసింది అని హోంమంత్రి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతమైన, చైతన్యవంతమైన నాయకత్వంలో జైళ్ల శాఖ వినూత్న ప్రగతిశీల కార్యక్రమాలను ప్రవేశ పెట్టిందన్నారు. అందులో భాగంగానే మహిళా ఖైదీలను ముందస్తుగా విడుదల చేయడానికి అర్హత ప్రమాణాలు, షరతులను సరళీకృతం చేసిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మరో మైలురాయి అన్నారు. కార్పొరేట్ ట్రీట్మెంట్ ప్రయోజనం పొందడానికి ఖైదీలందరికీ ఈ పథకాన్ని విస్తరించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ అన్ని కేంద్ర కారాగారాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. గర్భిణీ ఖైదీలకు, వారి పిల్లలకు, వృద్ధ మహిళా ఖైదీలకు కూడా ప్రత్యేక ఆహారాన్ని అందజేస్తున్నారని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు, సరైన వెలుతురు, నివాస స్థలం, పౌష్టికాహారం, వినోద సౌకర్యాలు, వైద్య సదుపాయాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా అందించబడుతున్నాయన్నారు. ఖైదీల ప్రయోజనం కోసం విద్యా, వృత్తి, ప్రేరణ, భక్తి విషయాలను అందించడానికి ఆడియో విజువల్ , అన్ని సెంట్రల్ జైళ్లలో డిజిటల్ లైబ్రరీలు స్థాపించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ ఐజి రవి జోసఫ్ లొక్కు, ఏపీ హోం ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా, ఏపీ జైళ్ల ఐజీ ఐ.శ్రీనివాసరావు, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఐజీలు, డీఐజీలు, పోలీసు సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ములాఖాత్‌లో చంద్రబాబును కలిసిన భువనేశ్వరి

జైలులో భద్రతపై భయంగా ఉందని వెల్లడి

విశాలాంధ్ర–రాజమహేంద్రవరం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి జైల్లో రెండవ రోజు కూడా ఉదయాన్నే 5.40 నిమిషాలకు నిద్ర లేచి యోగా, మెడిటేషన్ చేశారు. సాయంత్రం ములాఖాత్‌లో భార్య భువనేశ్వరి కోడలు బ్రాహ్మణి చంద్రబాబు నాయుడుని కలిసి కొద్ది సేపు మాట్లాడారు. తదనంతరం బయటికి వచ్చి మీడియా సమావేశంలో భువనేశ్వరి మాట్లాడుతూ ఆయన కట్టించిన దానిలో ఆయనను కట్టిపడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజల కోసం, ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి కోసం ఆలోచించే ఆయన కోసం నేడు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నాడు నందమూరి తారక రామారావు పార్టీని నిర్మించారని, ఆ పార్టీ ప్రజలకు అండగా ఉందని, మా కుటుంబం కూడా మీకు అండగా ఉంటుందని ఆమె అన్నారు. జైలులో ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని, కానీ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారని, ప్రజల హక్కుల కోసమే ఆయన పోరాటం చేస్తున్నారని తెలిపారు. తాను బాగున్నానని, ఏమీ భయపడ వద్దని, తాను జైలు నుంచి బయటకు వచ్చి ప్రజా సేవ చేస్తానని చంద్రబాబు చెప్పారని భువనేశ్వరి తెలిపారు. 'మా కుటుంబం ఎప్పుడూ ప్రజలు, క్యాడర్ కోసం నిలుస్తుంది. ఎన్టీఆర్ పెట్టిన పార్టీ ఇది... ఏమీ కాదు. ప్రజలే తనకు ముఖ్యమని చంద్రబాబు ఎప్పుడూ అనే వారు. మన రాష్ట్రం... దేశంలో నంబర్‌వన్‌గా ఉండాలని అనేవారు. మా కుటుంబ సభ్యులకు ఇది చాలా కష్టకాలం. రాష్ట్ర ప్రజలంతా చంద్రబాబుకు అండగా నిలవాలి' అని భువనేశ్వరి కోరారు.

కన్నీటి పర్యంతం: 'చంద్రబాబు నిర్మించిన భవనంలోనే ఆయన్ను తీసుకెళ్లి పెట్టారు. చంద్రబాబును వీడి బయటకు వస్తుంటే నా మనసు చలించింది. ఆయన కోసం నా ఆత్మ వదిలేసి వచ్చా. ఇలాంటి పరిస్థితులు వస్తాయని ఊహించలేదు. చంద్రబాబు ఆరోగ్యం బాగానే ఉంది. ధైర్యంగా ఉన్నారు. చన్నీళ్ల స్నానం చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితి చాలా దారుణం. ఇది మాకు ఒక సవాల్' అంటూ భువనేశ్వరి కన్నీటి పర్యంతమయ్యారు.

పేదలకు భూ పంపిణీ కోసం ఉద్యమం

నవరత్నాలతో పేదలకు ఒరిగిందేమీ లేదు జిల్లా మహాసభలో ఆవుల శేఖర్

విశాలాంధ్ర–పుట్టపర్తి: పేదలకు భూ పంపిణీ చేయకపోతే ఉద్యమాలకు సిద్ధమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ హెచ్చరించారు. గణేశ్ కూడలిలోని షాదీ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రథమ మహాసభలు మంగళవారం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ హాజరయ్యారు. ఆవుల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల మహాసభలు జరుగుతున్నాయన్నారు. జిల్లాల మహాసభలు పూర్తయిన తర్వాత ఈనెల 25–27 తేదీలలో రాష్ట్ర మహాసభలు బాపట్లలో జరుగుతాయన్నారు. 25వ తేదీ జరిగే మహాసభకు పెద్దఎత్తున వ్యవసాయ కూలీలను, రైతులను సమీకరిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మహాసభలో చర్చిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల వల్ల పేదలకు మేలు జరగలేదన్నారు. పేదలకు ఉపాధి కోసం సాగు భూములు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్నదన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు భూ పంపిణీ చేశారని, ప్రస్తుత సీఎం జగన్ తన తండ్రి ఆశయాలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పేదల భూములు లాక్కోవడానికి అసైన్డ్ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం సవరిస్తూ జీవోలు ఇచ్చిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచడానికి అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ముందుకు రాకపోతే వ్యవసాయ శాఖ కార్మిక సంఘం అధ్వర్యంలో తామే భూ పంపిణీ చేస్తామన్నారు.

వేమయ్య యాదవ్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏడు విడతలగా భూ పంపిణీ చేశారన్నారు. తర్వాత ఏ ముఖ్యమంత్రి పేదలకు భూ పంపిణీ చేయలేదన్నారు. ఎమ్మెల్యేల బినామీలకు వ్యవసాయ చట్టం అమలు చేస్తున్నారన్నారు. భూములు సాగు చేయకపోయినా ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారికి పట్టాలు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. పేదలు భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదన్నారు. పేద రైతులు పదేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను భూమారకం పేరుతో ధరలు పెంచి జగన్‌మోహన్‌రెడ్డి వ్యాపారం సాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారం జోరుగా సాగిస్తున్నారని, భూ వ్యాపారాన్ని మొదలు పెట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందని వేమయ్య చెప్పారు. మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి గంగాధర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమణ, రైతు సంఘం నాయకులు వెంకటనారాయణ, రమణ, లేబర్ రైట్స్ ఫోరం నేత గంగరాజు, నాయకులు జయరాం నాయక్, వెంకట నారాయణ, నరసింహులు, చంద్ర, మహిళా నాయకులు ఈశ్వరమ్మ, రమణమ్మ, ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు జీవితం అవినీతిమయం: మేరుగు నాగార్జున

విశాలాంధ్రబ్యూరో–అమరావతి: చంద్రబాబు జీవితమంతా అవినీతి మయమేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవినీతి చేసి బాబు జైలుకెళ్లినా సిగ్గు రాలేదని, ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ తప్పించుకు తిరుగుతున్న చంద్రబాబు చట్టానికి చిక్కాడన్నారు. చంద్రబాబు అరెస్టు ద్వారా న్యాయం గెలిచిందని, చట్టాలు చంద్రబాబుకు చుట్టాలు కావని మొదటిసారి నిరూపితమైందన్నారు. చంద్రబాబు అవినీతి కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతోందని, రాబోయే రోజుల్లో చంద్రబాబు ఇంకా అనేక అవినీతి కేసుల్లో విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. చంద్రబాబు జైలుకు వెళ్లినా ఆయన అనుచరులు, కొడుకు లోకేశ్ ఏమాత్రం సిగ్గుపడటం లేదన్నారు. ఏలేరు స్కాం నుంచి హైటెక్ సిటీ, ఐఎంజీ భారత్, ఇరిగేషన్ ప్రాజెక్టులు, బీసీలకు పనిముట్లు కొనుగోలు, ప్రభుత్వ రంగ సంస్థల విక్రయం, ఓటుకు కోట్లు కేసు సైతం మేనేజ్ చేసుకుంటూ వచ్చారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు.

సీఎంకు బ్రహ్మోత్సవాల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవి ధర్మారెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలసి టీటీడీ సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఆహ్వానపత్రికతో పాటు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను సీఎంకు అందజేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనమిచ్చారు. ఈ నెల 18 నుంచి 26 వరకు 9 రోజుల పాటు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

చంద్రబాబు అవినీతి తేటతెల్లం

మంత్రి కారుమూరి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు నాయుడిని రిమాండ్‌కు పంపడంతో ఆయన అవినీతి తేటతెల్లమైందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు అవినీతి చేయలేదని లోకేశ్ చెప్పగలడా అని ప్రశ్నించారు. చంద్రబాబు దోపిడీ ప్రజలకు అర్థమైందని, అందుకే ఆయనను అరెస్టు చేసినా ప్రజాస్పందన కరువైందన్నారు. టీడీపీ బంద్‌కు ప్రజలు సహకరించలేదని వ్యాఖ్యానించారు. టీడీపీ పగ్గాల కోసం అప్పుడే ఆ పార్టీలో దుమారం మొదలైందని, ఇటు నందమూరి బాలకృష్ణ. అటు యనమల రామకృష్ణుడు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో రోజుకు కోటి రూపాయలు తీసుకునే లాయర్లు వచ్చి వాదించినా చంద్రబాబుకు రిమాండ్ తప్పలేదన్నారు. సీఎం జగన్ సుపరిపాలన అందిస్తున్నారని, నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో 11.10 శాతం ఉన్న పేదరికం 6 శాతానికి తగ్గిందని వివరించారు. చంద్రబాబు హయాంలో 15వ స్థానంలో ఉన్న చదువులు...ఇప్పుడు మూడో స్థానానికి వచ్చాయన్నారు. 12వ స్థానంలో ఉన్న పేదరికం 6వ స్థానానికి వచ్చిందన్నారు. ఇదంతా జగన్ నిష్పక్షపాలన, నిజాయతీతో పథకాల అమలు వల్లనే సాధ్యమైందని, చదువుల విప్లవం తీసుకొచ్చారని తెలిపారు. పథకాలు, సంస్కరణలతో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని వివరించారు. ప్రజల సొమ్ము యథేచ్ఛగా తిన్న చంద్రబాబుపై ప్రజలకు కోపంగా ఉందని, చంద్రబాబుకు ఒకప్పుడు కేవలం రెండెకరాల భూమి మాత్రమే ఉంటే, ఇప్పుడు ఆయన ఆస్తి మూడు లక్షల కోట్లు అని, ఈ విషయాన్ని చంద్రబాబే స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. చంద్రబాబు కోసం లోకేశ్ తపన పడుతున్నారని, తన తల్లిని, కుటుంబాన్ని తిట్టారంటూ నాడు గగ్గోలు పెట్టిన పవన్...ఇప్పుడు చంద్రబాబు కోసమే పనిచేస్తున్నాడని మండిపడ్డారు.

'ఓటరు జాబితా' విధుల్లో ఒత్తిడి లేకుండా చర్యలు

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఓటరు జాబితా సవరణ, సవరణ–2024లో భాగంగా రెవెన్యూ సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి లేకుండా, సజావుగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేశ్ కుమార్ మీనాకు మంగళవారం నేతలు వినతిపత్రం అందజేశారు. ఓటరు జాబితా సవరణ, సవరణతోపాటు ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకూ రీ–సర్వే విధులకు సంబంధించి ఎలాంటి లక్ష్యం అధికారులపై విధించవద్దని కోరారు. సాధారణ రెవెన్యూ విధులు తప్ప, ఇతర విధులు, ఇతర శాఖల విధులు తహసీల్దార్లకు కేటాయించవద్దని చెప్పారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 షెడ్యూలు ప్రకారం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు తగినంత సమయం ఇవ్వాలన్నారు. 2019 సాధారణ ఎన్నికల ప్రక్రియకు ఖర్చుపెట్టిన కొన్ని జిల్లాల బిల్లులు నేటికీ చెల్లించలేదని వివరించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, బీఎల్ఓ, సూపర్‌వైజర్లు అనేక రకాల విధులకు హాజరవుతున్నందున ఓటర్ల జాబితాల సవరణ పూర్తయ్యే వరకు ఓటర్ల జాబితా సవరణ విధులకు మాత్రమే హాజరయ్యేలా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారులందరికీ ఆదేశాలు జారీ చేయాలన్నారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం కొన్ని జిల్లాలు సమర్పించిన పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని, ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించిన అధికారులకు అయ్యే కనీస ఛార్జీలను మంజూరు చేయాలని కోరారు. వాటిపై సీఈవో ముఖేశ్ కుమార్ మీనా సానుకూలంగా స్పందించినట్లు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి తెలిపారు.

మండలికి గాడిచెర్ల అవార్డు

విశాలాంధ్ర–అవనిగడ్డ: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, పత్రికా రచయిత, గ్రంథాలయోధ్యమ నాయకులు సర్వశ్రీ గాడిచెర్ల సర్వోత్తమరావు పేరిట ఇచ్చే " గాడిచెర్ల అవార్డు" కు మాజీ ఉపసభాపతి, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ ఎన్నిక చేశారు.

గాడిచెర్ల ఫౌండేషన్ – కర్నూలు, ఎగ్జిబిషన్ సొసైటీ – కర్నూలు, ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ – విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కృష్ణా యూనివర్సిటీలో జరిగే అవార్డు ప్రదాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని బుద్ధప్రసాద్‌కి అవార్డు ప్రదానం చేస్తారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమ చంద్రారెడ్డి, గాడిచెర్ల ఫౌండేషన్ ప్రధాన పోషకులు టీజీ వెంకటేశ్, కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జి.జ్ఞానమణి, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కె. చంద్రశేఖర కల్కుర అతిథులుగా పాల్గొంటారని ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద, సమన్వయ కర్త గుత్తికొండ సుబ్బారావు తెలిపారు.

గగన్‌యాన్ తరహాలో 'సముద్రయాన్'

- వచ్చే ఏడాది ప్రయోగానికి చురుగ్గా ఏర్పాట్లు
- 6 వేల మీటర్ల లోతున సముద్ర గర్భ అన్వేషణ
- కేంద్ర భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ రవిచంద్రన్

విశాలాంధ్ర–తిరుపతి : గగన్‌యాన్ తరహా లో సముద్రయాన్‌కు భారత శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారని, వచ్చే ఏడాది ఈ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశం ఉందని కేంద్ర భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ రవిచంద్రన్ తెలిపారు. డీప్ ఓషన్ టెక్నాలజీ మిషన్‌లో భాగంగా సముద్ర వనరులు, సముద్ర గర్భంలోని జీవ వైవిధ్యంపై అధ్యయనం చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపడు తున్నట్లు వివరించారు. తిరుపతి ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విజ్ఞానభారతి సంయుక్తంగా తిరుపతి ఐఐటీలో మంగళవారం నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్స్ పై నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో డాక్టర్ రవిచంద్రన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు అక్వానాట్స్‌తో ప్రయాణం చేయడానికి అనువైన జలాంతర్గామిని ఈ పరిశోధనకు సిద్ధం చేస్తు న్నట్లు చెప్పారు. అంతేకాకుండా సముద్ర జల చరాలను గుర్తించడమే కాకుండా వాటి పరి రక్షణకు డీప్ సీ డైవర్సిటీ పరిశోధన జరుగు తుందన్నారు. చమురు, సహజ వాయువు, మెటల్స్ వంటి సముద్ర ఆర్థిక వనరులను సమగ్రంగా గుర్తించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. భారత ఆర్థిక వృద్ధి రేటులో 4 శాతం బ్లూ ఎకానమీ ద్వారా సమ కూరుతున్నట్లు రవిచంద్రన్ తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ కె.సారస్వత్ మాట్లా డుతూ సమాజ స్థితిగతులను సైన్స్ మారు స్తుందన్నారు. స్థిరమైన సమాజం కోసం శాస్త్ర సాంకేతిక రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. సాంకేతికత ద్వారా సంపదను సృష్టించుకోవాలని సూచించారు. డీఆర్డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ బి.కె.దాస్ డీఆర్డీవో సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, అలాగే, భారత రాడార్లు, ఆయుధాల సామర్థ్యాన్ని వివరిస్తూ టెక్నాలజీ వృద్ధి కోసం డీఆర్డీవో చేస్తున్న కృషిని వివరించారు. శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ జ్ఞానం లేని విద్య, మానవత్వం లేని మనిషి వ్యర్థమన్నారు. హెపటైటిస్ బి టీకాను తయారు చేసిన నేపథ్యాన్ని వివరిస్తూ, కష్టాన్ని నమ్ముకున్న ప్రతి ఒక్కరూ సత్ఫలితాలను సాధిస్తారన్నారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ స్వాగతోపన్యాసంలో ఐఐటీ గురించి, పరిశోధనలను పెంచేందుకు జరుగు తున్న కృషిని వివరించారు. తిరుపతి ఐఎస్‌టీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ డి.నారాయణరావు మాట్లా డుతూ శాస్త్ర, సాంకేతికతపై విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లకు సమగ్రమైన అవగాహన కల్పించడమే కాకుండా తగిన విధంగా ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఐఎస్‌టీఎఫ్‌ని ప్రారంభించామన్నారు. ఈ వేదిక ద్వారా పరిశోధనావకాశాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో విజ్ఞానభారతి ప్రతినిధి త్రిస్తా ఠాకూర్, ఐఎస్‌టీఎఫ్ కార్యదర్శి టి.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : రవీంద్రనాథ్

విశాలాంధ్ర–విజయవాడ: గ్రామీణ తపాల ఉద్యోగులను డిపార్టుమెంట్ ఉద్యోగలుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపాల శాఖ జీడీఎస్ పీజేసీఏ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా మంగళవారం నిరాహార దీక్ష జరిగింది. నిరాహార దీక్షలో భాగంగా ఇక్కడి సీపీఎంజీ ఆఫీసు రాష్ట్రస్థాయి దీక్షలో 23 డివిజన్స్, 12 బ్రాంచిల నుంచి దాదాపు 600 మంది గ్రామీణ డాక్ సేవ సభ్యులు పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులు పది, పన్నెండువేల రూపాయల చాలీచాలని జీతాలతో అష్ట కష్టాలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు పెంచాలని, ఫించన్, గ్రాట్యూటీ, ఆరోగ్య బీమా తదితరాలను వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు వై.మర్రిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ యోగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కె.మీరావలి, కృష్ణ యాదవ్, జమాల్ బాషా, ప్రభాకర్, నారాయణ, రాఘవేంద్ర, హేమలత తదితరులు మాట్లాడారు.

ఏపీ పీటీడీ ఈయూకు గుర్తింపు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఏపీపీటీడీ(ఆర్టీసీ)ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ)కు గుర్తింపు సంఘంగా ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం పట్ల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే సమయంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ క్రియాశీలక పాత్ర పోషించిందని, ఆ దిశగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందని గుర్తుచేశారు. ఏపీ జేఏసీ అమరావతి అధ్వర్యంలో 92 రోజులు చేసిన ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం వైఎస్ జగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అంగీకరించారన్నారు. ఈ మేరకు ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్‌కు జీవో నంబరు 97 ద్వారా గుర్తింపునిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడంపై రాష్ట్ర కమిటీ తరపున సీఎం జగన్‌కు, సీఎస్ జవహర్‌రెడ్డికి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తదితరులకు యూనియన్ నేతలు ధన్యవాదాలు తెలిపారు.

250 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల భర్తీకి ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), వైద్యారోగ్య సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న 250 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల ఉద్యోగాలను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ నియామక ప్రకటన జారీజేసింది. పీహెచ్‌సీతో పాటు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ల ఖాళీలున్నాయి. వాటికి ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. అర్హతగల అభ్యర్థులు ఈనెల 13 నుంచి 24వ తేదీ రాత్రి 11.59 నిముషాలలోపు దరఖాస్తు చేయాలి. జనరల్ అభ్యర్థులు 42 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు, పీహెచ్ అభ్యర్థులకు ఐదేళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. జోన్ 1, జోన్ 2, జోన్ 3, జోన్ 4 కేటగిరీలుగా రాత పరీక్ష ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేస్తారు. పూర్తి వివరాలను ఎఎవ.ఖజూ.అఱఎ.ఱఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దరఖాస్తు ఫీజు జనరల్ కేటగిరీ అభ్యర్థులకు వెయ్యి రూపాయలు, రిజర్వేషన్ వర్గాలకు రూ.500 గా నిర్ణయించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
దేవదాయ ధర్మదాయ శాఖ, శ్రీపొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా
శ్రీ కైలాసనాథ స్వామివారి దేవస్థానము, వేగూరు గ్రామము
కోవూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
టెండర్ ప్రకటన
పై దేవస్థానము పున:నిర్మాణము చేయుటకు ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వార టెండర్లు పిలిచి వున్నారు. ఆసక్తికలిగిన వారు క్రింది వెబ్‌సైట్ నందు టెండర్ వివరములు చూడవచ్చును, వెబ్‌సైట్ అడ్రస్:
https:/tender.apeprocurement.gov.in// అను వెబ్‌సైట్ టెండర్ వివరములు చూడవచ్చును.
చైర్మన్ & ధర్మకర్తల మండలి ఇట్లు: ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

సంపాదకీయం

రెండు సంకటాల మధ్య షిందే

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే రెండు రాజకీయ సంకటాలలో చిక్కుకున్నారు. శివసేనను చీల్చి బీజేపీతో కలిసి ముఖ్యమంత్రిని అయిపోయానని ఆనందించే అవకాశం కూడా షిందేకు లేకుండా పోతోంది. ముఖ్యమంత్రి స్థానంలో షిందే ఉన్నా 288 మంది సభ్యులుగల శాసనసభలో ఆయన నాయకత్వంలోని శివసేనలో ఉన్నది మహా అయితే 40 మంది. ఉపముఖ్యమంత్రిగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ పార్టీలో 105 మంది శాసనసభ్యులున్నారు. ఇది ఆయన పదవికి ఉన్న భద్రత ఏపాటిదో తెలియజేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల తరవాత అదే సంవత్సరం అక్టోబర్‌లో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగవలసి ఉంది. శివసేనను షిందే చీల్చగలిగినప్పటికీ ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనకు జనం మద్దతు ఉందనిపిస్తోంది. అంటే పార్లమెంటు ఎన్నికలు, ఆ తరవాత జరిగే శాసనసభ ఎన్నికలు షిందేకు అగ్నిపరీక్షే. మరో వేపు మూడు దశాబ్దాల నుంచి కొనసాగుతున్న మరాఠాల రిజర్వేషన్ పోరాటం ఈ మధ్య కాలంలో మళ్లీ ఊపందుకుంది. జాల్నా జిల్లాలోని అంతర్వాలి సారథి గ్రామానికి చెందిన యువ మరాఠా కార్యకర్త మనోజ్ జరంగే పాటిల్ పదిహేను రోజుల కింద మరాఠాలకు రిజర్వేషన్ల కోసం ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయనను ఆసుపత్రిలో చేర్పించి దీక్షను భగ్నం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించడంవల్ల ఆందోళన మరింత ఉధృతం అయింది. మనోజ్ పాటిల్ ఓ దశాబ్ద కాలం నుంచి రాజకీయాలలో ఉన్నా ఆయన పేరు నెల కిందటి దాకా చాలామందికి తెలియదు. తాను ఏ పార్టీకి చెందని వాడినని చెప్పుకుంటారు. మరాఠాలకు రిజర్వేషన్లు సంవేదనలకు సంబంధించిన అంశం కనక ఆయన దీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికలలో, ఆ తరవాత జరిగే శాసనసభ ఎన్నికలలో బీజేపీకి ఉన్న జనాదరణ ఏమిటో అంచనా వేయడానికి బీజేపీ చేయించిన సర్వే ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం బీజేపీకి ఉన్న 105 మంది శాసనసభ్యులలో, 21 మంది లోకసభ సభ్యులలో 40 శాతం మంది ఓడిపోతారని ఈ సర్వే ఫలితాలు సూచించాయి. అయితే వచ్చే ఎన్నికలలో అభ్యర్థులను మారిస్తే ఫలితాలు మెరుగుపడవచ్చునన్న వాదనలూ వినిపిస్తున్నాయి. గుజరాత్‌లో కిందటి శాసనసభ ఎన్నికలకు ముందు మొత్తం ప్రభుత్వాన్నే టోకున మార్చేయడంవల్ల బీజేపీ మళ్లీ అధికారం సంపాదించగలిగింది. బీజేపీ పనుపున నిర్వహించిన సర్వేలో శాసనసభ్యుల, ఎంపీల పనితీరు, ప్రజలతో వారి సంబంధాలు, బీజేపీ కార్యనిర్వాహక సభ్యులకు జనంతో ఉన్న సంబంధాలు, సామాజిక మాధ్యమాలను వారు ఏ మేరకు వినియోగించుకుంటున్నారు అన్న అంశాలపై కూడా జనాభిప్రాయం సేకరించారు. ఈ అంశాలేవీ ప్రస్తుతానికి బీజేపీకి అనుకూలంగా లేవు. మోదీ మళ్లీ ప్రధాని కావాలనుకుంటున్న వారు ఉన్నారు కానీ బీజేపీ తరఫున ఎన్నికైన ప్రజా ప్రతినిధులపై అసంతృప్తి తీవ్రంగా ఉంది. దీనికి భిన్నంగా బీజేపీ మాత్రం 170 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంటామని తమ కూటమి మొత్తం 48 లోకసభ స్థానాలను కైవశం చేసుకుంటుందని వాదిస్తోంది. 2019 లోకసభ ఎన్నికల సమయంలో బీజేపీ-శివసేన మధ్య ఎన్నికల పొత్తు ఉండేది. అందువల్ల బీజేపీ 23 లోకసభ స్థానాలను, శివసేన 18 స్థానాలను సాధించగలిగాయి. అంటే 48లో 41 సీట్లు ఎన్.డి.ఎ. కూటమికే దక్కాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మనోజ్ పాటిల్ ప్రారంభించిన మరాఠా రిజర్వేషన్ల ఆందోళన క్రమంగా విస్తరిస్తోంది. గ్రామాలకు కూడా పాకుతోంది. గత రెండు వారాలుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు మనోజ్ పాటిల్‌ను పరామర్శించడంలో తలమునకలై ఉన్నారు. ఎన్సీపీ నాయకుడు శరద్ పవార్ కూడా జాల్నా వెళ్లి వచ్చారు. పాటిల్ నిరాహార దీక్ష ప్రారంభించిన తరవాత పరిస్థితి చక్కదిద్దడానికి ముఖ్యమంత్రి షిందే గత ఆరవ తేదీన ఒక ఆదేశం జారీ చేశారు. మరాఠాలలో కుంబీలైనవారు తాము ఆ కులానికి చెందిన వాళ్లమని సర్టిఫికేట్ అందజేస్తే ఓబీసీ రిజర్వేషన్లు వర్తింప చేస్తామని షిందే ప్రకటించారు. మరాఠాల ఆందోళనకు సుదీర్ఘ చరిత్ర ఉన్నప్పటికీ ఆ వర్గం వెనుకబడింది కాదు. షిందే, శరద్ పవార్ కూడా మరాఠాలే. రాష్ట్ర జనాభాలో 31 శాతం మంది మరాఠాలే. రాజకీయాల్లో ఆధిపత్యమూ వారిదే. 1960లో ప్రత్యేక మహారాష్ట్ర ఏర్పడినప్పటినుంచి 20 మంది ముఖ్యమంత్రులైతే అందులో 12 మంది మరాఠాలే. విద్యాశాఖలో మరాఠాలు 54 శాతం ఉంటే సహకార చక్కెర ఫ్యాక్టరీలలో 70 శాతం, వ్యవసాయ భూమిలో 70 శాతం ఆ వర్గం చేతిలోనే ఉంది. కానీ విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ హయాంలో ఓబీసీల రిజర్వేషన్లు అమలు అయిన తరవాతే మరాఠాలకు రిజర్వేషన్లు కావాలన్న డిమాండు తలెత్తింది. మండల్ నివేదిక అమలయ్యే దాకా వీరు ఎప్పుడూ వెనుకబడిన వర్గాల వాళ్లమని చెప్పుకోలేదు. కానీ వ్యవసాయ రంగం మీద ఆధారపడిన మరాఠాలే ఎక్కువ కనక, క్రమంగా ఆ రంగంలో ఆదాయాలు తగ్గుతున్నందువల్ల మరాఠా యువతలో రిజర్వేషన్లు కావాలన్న వాదన మొదలైంది. 2014కు ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్-ఎన్సీపీ ప్రభుత్వం వీరికి 16 శాతం రిజర్వేషన్లు కల్పించింది. అయితే ఈ హామీ అమలు చేయడానికి ఏ అధ్యయనమూ జరగలేదు. ఏ కమిషన్‌నూ నియమించలేదు. తరవాత అధికారంలోకొచ్చిన ఫడ్నవీస్ ప్రభుత్వం కూడా ఈ రిజర్వేషన్లు అమలు చేసింది. ఆయన హయాంలోనే రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ కూడా ఏర్పాటు చేశారు. విద్యాశాఖలో 12 శాతం, ఉద్యోగాల్లో 13 శాతం మరాఠాలకు ప్రత్యేకించడాన్ని ముంబై హైకోర్టు సమర్థించింది. 2021లో సుప్రీంకోర్టు ఈ రిజర్వేషన్లు చెల్లవని ప్రకటించింది. అందుకని ఎన్నికలు మొగదలలో ఉన్న సమయంలో మళ్లీ రిజర్వేషన్ల అంశం తెరమీదకు వచ్చింది. అధికారంలో ఉన్న షిందే ప్రభుత్వం షరతులతో రిజర్వేషన్ల అమలుకు అంగీకరించింది. మునుపు కాంగ్రెస్-ఎన్సీపీ ప్రభుత్వం, ఆ తరవాత ఫడ్నవీస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఈ రిజర్వేషన్లకు సమ్మతించాయి కనక ప్రధాన రాజకీయ పార్టీలు ఏవీ రిజర్వేషన్ల డిమాండును వ్యతిరేకించే పరిస్థితిలేదు. కానీ సుప్రీంకోర్టు కొట్టేసిన తరవాత అమలు చేయడం ఎలా అన్నదే సమస్య. షిందే ఉదారంగా ప్రకటించిన రాయితీని మళ్లీ సవాలు చేయరన్న భరోసా ఏమీ లేదు. ఓబీసీ రిజర్వేషన్ల కోటా లోంచే కుంబీలకు రిజర్వేషన్లు కల్పించడంపై వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఓబీసీలకు ప్రస్తుతం 19 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బీజేపీ గెలిచే అవకాశాలు సన్నగిల్లుతున్నాయన్న సర్వేల సూచనలు ఒక వేపు, రిజర్వేషన్ల రగడ మరో వేపు షిందే ప్రభుత్వాన్ని సంకటస్థితిలో పడవేస్తున్నాయి.

భద్రతలేని గిగ్ కార్మికులు

భారతదేశంలో ప్రపంచీకరణ పెరిగిన తరువాత గిగ్ పని సంస్కృతి పెరిగింది. గిగ్ పని సంస్కృతిలో క్యాబ్ డ్రైవర్స్, జోమోటో, స్విగ్గి డెలివరీ బాయ్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో పనిచేసే కార్పెంటర్స్, ప్లంబర్స్ లాంటి వారు ఈ కోవకు చెందుతారు. భారతదేశంలో ప్రస్తుతం 1.5 కోట్లకు పైగా గిగ్ వర్కర్లు ఉన్నట్లు అంచనా. వీటిలో డెలివరీ సేవలలో 99 లక్షలు ఉన్నట్లు అంచనా. 2022లో నీతిఆయోగ్ నివేదిక ప్రకారం, 2029 నాటికి దాదాపు 2.35 కోట్ల మంది కార్మికులు గిగ్ ఎకానమీలో పనిచేయనున్నారు. భారతదేశ కార్మిక చట్టాల ప్రకారం, గిగ్ కార్మికులు కార్మికులుగా గుర్తించడంలేదు. వారు "డెలివరీ భాగస్వాములు", "డెలివరీ ఎగ్జిక్యూటివ్‌లు" వంటి పేర్లతో పనిచేస్తున్నారు. ఈ విధానం పెట్టుబడిదారీ సంస్థ నిజమైన దోపిడీ లక్షణాన్ని దాచిపెడుతుంది. వేతనాలపై కోడ్, పారిశ్రామిక సంబంధాలపై కోడ్, ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్‌పై కోడ్‌లో సూచించిన విధంగా కార్మికులకువచ్చే అన్ని హక్కుల నుండి గిగ్ వర్కర్లను మినహాయిస్తున్నారు. వీటిలో గంటలు, కనీస వేతనాలు, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య ప్రయోజనాలు, ఓవర్ టైం వేతనంపై పరిమితి ఉన్నాయి. ఈ యూనియన్‌లు అధికారికంగా గుర్తించనందున కంపెనీ యజమానులపై లేబర్ కోర్టులలో కేసులు వేయలేనందున కంపెనీ యజమానులు ఏ యూనియన్‌లతోనూ చర్చలు జరపడానికి నిరాకరిస్తున్నారు. గిగ్ వర్కర్లకు నిర్దిష్ట పనిగంటలు లేవు. వారి పని షెడ్యూల్ సెట్‌చేశారు. యజమాని కంపెనీల ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కచ్చితంగా పర్యవేక్షిస్తారు. వారి పనిగంటలు తరచుగా రోజుకు 12-14 గంటల వరకు పొడిగిస్తున్నారు. ఇది వారికి విశ్రాంతి తీసుకోవడానికి లేదు. కుటుంబ సభ్యులతో చాలా తక్కువ సమయం గడుపుతున్నారు. గిగ్ వర్కర్లు తమ సేవలను తక్కువ సమయంలో అందించాలనే ఒత్తిడిలో ఉన్నారు. ప్రత్యేకించి డెలివరీ వర్కర్లు, క్యాబ్, ఆటో డ్రైవర్లు నిర్దిష్ట వ్యవధిలో ట్రిప్పుల సంఖ్యను పెంచుకోవడానికి విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. తత్ఫలితంగా, వారు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు, ఇది కొన్నిసార్లు ప్రాణాంతకంగా కూడా మారుతుంది. జీవనోపాధికి అభద్రత, స్థిరమైన ఉద్యోగం లేకపోవడం, తగిన, సురక్షితమైన ఆదాయం గిగ్ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య.

గిగ్ ఎకానమీలో చాలామంది డెలివరీ కార్మికుల సగటు ఆదాయాలు సాధారణంగా ప్రభుత్వం ప్రకటించిన కనీసవేతనాల కంటే తక్కువగా ఉన్నాయి. యాజమాన్య సంస్థలు ప్రారంభంలో అందించిన చాలా ప్రోత్సాహకాలను ఉపసంహరించుకుంటున్నారు. కంపెనీ లాభదాయకం కాదని భావించినప్పుడల్లా, క్షణంలో నోటీసు ఇచ్చి వారిని ఉద్యోగాల నుండి తొలగించవచ్చు. కంపెనీ యజమానులు కార్మికులను రోజుకు 12-14 గంటల పాటు కనీస వేతనాలతో పనిచేయమని ఒత్తిడిచేయడం ద్వారా కొనసాగించవచ్చు. వారి పనిసమయంలో జరిగే ప్రమాదాలకు వైద్య ఖర్చులను తిరస్కరించవచ్చు. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా వారిని ఉద్యోగాల నుండి తొలగించవచ్చు. కార్మికులుగా గుర్తింపు లేకుండా, ట్రేడ్ యూనియన్ హక్కులు లేనప్పుడు, గిగ్ కార్మికులు తమ డిమాండ్ల కోసం సమిష్టిగా పోరాడే స్థితిలో సమస్యలకు పరిష్కారం లేదు. గిగ్ ఎకానమీలో చేరిన కార్మికుల సంఖ్య పెరగడంతో, ఇతర రకాల ఉపాధి లేనప్పుడు, కార్మిక సంఘాలు, కార్మికవర్గ సంస్థలు గిగ్ కార్మికులను కార్మికులుగా చట్టబద్ధంగా గుర్తించడం, స్థిర పని వంటి వారి హక్కులను కాపాడేందుకు ఆందోళన చేయాలి. గంటలు, సురక్షితమైన పని పరిస్థితులు, కనీస వేతనాలు, ఉద్యోగాల భద్రత, సామాజిక భద్రత, యూనియన్‌ల ఏర్పాటు హక్కు, ఫిర్యాదుల పరిష్కారానికి యంత్రాంగాలు మొదలైనవి అవసరం. గిగ్ వర్కర్లు మిగిలిన కార్మికవర్గంతో చేతులు కలపాలి. గిగ్ కార్మికులకు ఆరోగ్య సంరక్షణ, తగిన ఆదాయం, సామాజిక భద్రతా ప్రయోజనాలు వంటి హక్కులను పొందడం కొరకు కార్మిక సంఘాలు సమిష్టిగా కృషి చేయాలి.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752

కమ్యూనిజంపై కసితో ట్విట్టర్ కొన్న మస్క్

ఎం కోటేశ్వరరావు

కమ్యూనిజం విస్తరణను అడ్డుకునేందుకు అమెరికా ఇతర ధనిక దేశాలు ప్రచ్ఛన్న యుద్ధం సాగించాయి. అనేక దేశాల్లో కుట్రలు చేశాయి. మిలిటరీ నియంతలను గద్దెలపై కూర్చోపెట్టాయి. సైనిక కూటములను ఏర్పాటు చేశాయి. వియత్నాం, లావోస్, కంపూచియా, ఉత్తర కొరియాలపై భౌతిక దాడులకు పాల్పడి భంగపడ్డాయి. విధిలేని స్థితిలో వియత్నాం నుంచి అమెరికన్లు బతుకు జీవుడా అంటూ పారిపోయారు. తన కుమార్తె కమ్యూనిస్టుగా మారిందన్న ఉక్రోషం, కమ్యూనిస్టు భావజాల ప్రచార వేదికగా సామాజిక మాధ్యమం ట్విటర్‌నే ప్రపంచ ధనవంతులలో ప్రధమస్థానంలో ఉన్న ఎలన్ మస్క్ కొనుగోలు చేసినట్లు త్వరలో వెలువడనున్న జీవిత చరిత్రలో పేర్కొన్నదని వెల్లడైంది. ఎలన్ మస్క్ 2000 నుంచి 2016వరకు మూడు వివాహాలు చేసుకొని ముగ్గురికీ విడాకులు ఇచ్చాడు, తరువాత 2018 నుంచి 2021వరకు ఒకామెతో సహజీవనం చేశాడు. పది మంది పిల్లల్ని కన్నాడు. వారిలో ఒకడైన గ్జేవియర్ అలెగ్జాండర్ మస్క్ 2004లో పుట్టాడు. 2022 జూన్‌లో కాలిఫోర్నియా కోర్టుకు సమర్పించిన ఒక వినతిలో తన పేరును వివియన్ జెనా విల్సన్ అని మార్చుకొనేందుకు అంగీకరించాలని, తాను యువతిగా లింగమార్పిడి చేయించుకున్నట్లు పేర్కొన్నాడు. తన తండ్రి ఎలన్ మస్క్‌తో గానీ, అతని ఆస్తిపాస్తులతో గాని తనకు ఎలాంటి సంబంధం లేదని క్రటించాడు. 2021లో లింగమార్పిడి జరిగింది.

తన కుమారుడు లింగ మార్పిడి చేయించుకున్నదాని కంటే స్కూల్లో వామపక్ష భావజాలానికి ప్రభావితుడు కావటం ఎలన్ మస్క్‌కు ఆగ్రహం తెప్పించింది. పచ్చి మితవాది అయిన మస్క్ తన కుమార్తెను కమ్యూనిస్టుగా వర్ణించాడు. కాలిఫోర్నియాలోని ఒక స్కూల్లో ఏడాదికి 50వేల దాలర్ల ఫీజు చెల్లించి ఒక స్కూల్లో చదివిస్తుండగా కమ్యూనిస్టు భావజాల వైరస్‌కు గురైందని, తన పట్ల కుమార్తె వైఖరి మారటానికి కొంత వరకు క్రాస్‌రోడ్స్ ఆర్ట్స్ అండ్ సైన్సు స్కూలు పురోగామి విధానాలు కూడా కారణమని ఆరోపించాడు. తన కుమార్తె సోషలిజాన్ని అధిగమించి ధనవంతులందరూ దుష్టులని భావించే పూర్తిస్థాయి కమ్యూనిస్టుగా మారిందని చెప్పాడు. తొలి రోజుల్లో ఉదారవాద భావాలతో కొడుకు లేదా కుమార్తె ఉన్నట్లు సరిపెట్టుకున్న తరువాత తెగతెంపులు చేసుకున్నాడు. అంతే కాదు, దీనంతటికీ కమ్యూనిస్టు భావజాల ప్రచారానికి వేదికగా ఉపయోగపడుతున్న ట్విటర్ కూడా తన బిడ్డ వంటి అనేక మందిని మార్చుతున్నదని, ట్విటర్ వేదికగా ఆ భావజాలం రోజురోజుకు పెరుగుతున్నదని భావించాడు. అది ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, భావప్రకటనకు ముప్పుగా దాని విధానాలను మార్చేందుకు ఏకంగా

44 బిలియన్ డాలర్లతో ఆ సంస్థను కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు. అంటే పురోగామి భావాలను అడ్డుకొని మితవాద ప్రచారానికి దాన్ని వేదికగా మార్చనున్నాడన్నది స్పష్టం. దానికి అనుగుణంగానే గత యాజమాన్యం రద్దుచేసిన డొనాల్డ్ ట్రంప్ వంటి పచ్చి మితవాదుల ఖాతాలన్నింటినీ పునరుద్ధరించాడు. ట్విటర్ పేరు ఎక్స్‌గా మార్చాడు. వాల్టర్ ఇసాక్‌సన్ రాసిన ఎలన్‌మస్క్ జీవిత చరిత్రను సెప్టెంబరు 12న మార్కెట్‌కు విడుదల చేయనున్నారు. దాని గురించి ఆసక్తి కలిగించేందుకు కొన్ని భాగాలను మీడియాకు విడుదల చేశారు. ఎలన్ మస్క్ వంటి వారు కూడా అమెరికాలో తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు. ఒక బంతిని ఎదురుగా ఉన్న గోడవైపు ఎంత గట్టిగా విసిరితే అంతే వేగంతో తిరిగి మనవైపు వస్తుంది. భావజాలం కూడా అంతే. దేన్నయినా అణచివేయాలని చూస్తే అంతేవేగంతో విస్తరిస్తుంది. కొత్త రాతియుగం నుంచి నేటి వరకు కమ్యూనిజం చరిత్ర పేరుతో జర్నలిస్టు పాల్ మాసన్ రాస్తున్న పుస్తకం 2026లో విడుదల కానుంది. ఒక భావం, ఒక ఉద్యమం, ఒక పాలన వరకు ఎలా పరిణమించిందీ ఇందులో ఉంటుందని చెబుతున్నారు. కమ్యూనిస్టులు పురాతన, మధ్యయుగాలలో సంభవించిన తిరుగుబాట్ల నుంచి ఈ భావ చరిత్రను గుర్తించారు. పందొమ్మిదవ శతాబ్ది పెట్టుబడిదారీ వ్యతిరేక ఉద్యమాల పెరుగుదలతోనే ఈ కథ ముగియలేదు అన్నాడు పాల్ మాసన్. "పశ్చిమ దేశాల ప్రజాస్వామ్యాలు గిడసబారాయి, తమమీద తమకే విశ్వాసం లేకుండా ఉన్నాయి. వాతావరణం గురించి పెరుగుతున్న ఆందోళన విప్లవాత్మక, ఆర్థిక సమాధానాలను డిమాండ్ చేస్తున్నది. ప్రపంచ పేద దేశాల్లోని కోట్లాది మంది జనం దృష్టిలో చైనా ముందుకు తెచ్చిన అధికారతత్వ(ఇది రచయిత పదజాలం కాదు) రాజ్య నేతృత్వంలోని అభివృద్ధి ప్రత్యామ్నాయ నమూనాగా చూస్తున్నారు. ఇరవై సంవత్సరాల క్రితం కమ్యూనిజం అంతాన్ని చూశామని అనుకున్నాం. ఈ రోజు ప్రపంచంలో అతిపెద్ద రాజకీయపార్టీ కమ్యూనిస్టు పార్టీయే. ప్రపంచంలో అత్యంత విజయవంతమైన ఆర్థిక వ్యవస్థగా ఉంది. కావున ప్రచ్ఛన్న యుద్ధంలో భావజాల విజేతలు సెలవు తీసుకుంటూ రాసిన ఉద్గ్రంధాలన్నిటినీ భిన్నమైన చరిత్రగా చూడాల్సిన అవసరం ఉన్నదని భావిస్తున్నాను. ఇప్పటికీ అనేకమంది ఆర్థిక పురోగతి సాధనకు, స్వేచ్ఛకోసం ఎందుకు సిద్ధం అవుతున్నారో అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది" అని పాల్ మాసన్ చెప్పాడు. అమెరికా స్కూళ్లలో విద్యార్థులు కమ్యూనిస్టులుగా మారుతున్నారని గుండెలు బాదుకుంటున్నది ఒక్క ఎలన్ మస్క్ మాత్రమే కాదు. అనేక మంది మితవాద రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధులు కూడా కమ్యూనిస్టు, చైనా వ్యతిరేకతతో ఊగిపోతున్నారు. అమెరికా స్కూళ్లు, విశ్వవిద్యాలయాలు చైనా సంస్థలతో పరిశోధనా ప్రాజక్టులలో భాగస్వాములు కావటాన్ని నిషేధించాలని సెనెటర్ జేమ్స్ లాంక్‌ఫోర్డ్ డిమాండ్ చేశాడు. అంతర్జాతీయంగానే కాదు, అమెరికా గడ్డ మీద కూడా దేశాన్ని సవాలు చేస్తున్నదని, విద్యా సంస్థలలో పాతుకుపోతున్నదని ఒక ప్రకటనలో తాజాగా ఆరోపించాడు. అమెరికా పరిశోధనలను తస్కరిస్తున్నదని, రాజకీయంగా విద్యార్థులు, బోధకులు, వారి కుటుంబాల మీద ప్రభావం చూపుతున్నదని చెప్పుకున్నాడు. అమెరికాలో తన ప్రతిష్టను పెంచేందుకు అనేక పథకాలను రూపొందించిందని, వాటి ద్వారా గూఢచర్యం జరుపుతున్నదని ఆరోపించాడు. ఆగస్టు 27న పరిశోధన ఒప్పందం ముగిసినప్పటికీ జో బైడెన్ సర్కార్ మరో ఆరునెలలు పొడిగించిందని వాపోయాడు. కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదం అమెరికా పక్కనే ఉన్న మెక్సికోకు కూడా పాకింది. పాఠ్యపుస్తకాలకు కమ్యూనిస్టు వైరస్ సోకిందంటూ కొన్ని చోట్ల క్రైస్తవ మత బృందాలు తలిదండ్రుల పేరుతో కొందరిని సమీకరించి పుస్తకాలను తగులబెట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పుస్తకాల్లో లైంగిక విజ్ఞానం, లింగసమానత్వం వంటి అంశాలు ఉన్నాయన్నది వారి ఆరోపణ. వాటి పంపిణీ నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ పుస్తకాల్లో మార్క్సిస్టు-కమ్యూనిస్టు సిద్ధాంతాలను చేర్చారని ఆరోపించారు. ప్రభుత్వం ఈ ఆరోపణలను కొట్టిపారవేసింది. పాఠ్య అంశాలను టీచర్లు, నిపుణులు రూపొందించినట్లు పేర్కొన్నది.

సంచార జాతులకు విముక్తి ఏది?

ఇ-మెయిల్

రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది సంచార జాతులు అన్ని జిల్లాలలో అడుగడుగునా వున్నారు. వారిని ఎవ్వరు పట్టించుకోవడం లేదు..ఆర్థికంగా వెనుక బడి వున్న ఈ జాతుల వారికి ఇకనైనా విముక్తి కల్పించాలి. వారికి ఇంటి పట్టాలు లేవు.. పాత గుడ్డలతో గుడిసెలు వేసుకుని జీవిస్తారు. ఇంటి స్థలం లేదు స్వంత స్థలం లేదు.. అడవి కొండ ప్రాంతం లో ఊరి బయట వీరి నివాసం అయితే పాలక ప్రభుత్వం వీరి గురించి అసలు పట్టించుకోకుండా ఉండడం విచారకరం. వీరి జీవనం కడు దుర్భరంగా ఉంటుంది. కొందరు పనులకు, మరికొందరు బిక్షాటనకు పోతారు. సంచార జాతులకు విముక్తి కల్పించే వారే లేరా వీరిని ప్రభుత్వం సర్వే జరిపి ప్రత్యేకంగా వీరికి ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు వంటి సదుపాయాలు కల్పించాలి. వీరి పిల్లలను చదివించేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికీ చీకట లోనున్న సంచార జాతులకు వెలుగులు కల్పించాలి. వీరి పేదరికంలో ఆశలు చిగురింప జేయాలి. సంచార జాతులు ఎక్కడ పడితే అక్కడ వుంటారు వారిని గమనించి ప్రభుత్వం వారికి తగిన సహాయం అందజేయాలి. ఆర్థిక వనరులు కల్పించాలి. సంచారజాతులు వారు కూడా అందరిలా జీవించేలా ఆర్థిక వనరులు ప్రభుత్వం సమాకూర్చాలి.. అప్పుడే వారి జీవితాలలో నవోదయం వికసింప జేయగలం.

ఎల్. ప్రపుల్ల చంద్ర
6300546700

పరిష్కారం లేని యుద్ధం

బి లలితానంద ప్రసాద్ (రిటైర్డ్ ప్రొఫెసర్)

దాదాపు ఒకటిన్నర సంవత్సరాలపైగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం ముగిసిపోలేదు. ఉక్రెయిన్ కోల్పోయిన భూభాగాన్ని తిరిగి పొందగలదని ఆశించింది. వసంతం వచ్చింది పోయింది. వేసవి వచ్చింది. ఉక్రెయిన్ తనపోరాటంలో తిరిగి పొందిన ప్రాంతాలు అంత ప్రధానమైనవి కావు. అక్టోబర్‌లో వర్షాలు ముమ్మరం అయ్యే లోపు ఏమైనా జరగాలి. వర్షాలు ఆరంభమైతే యుద్ధభూమి అంతా బురద భూమిగా మారుతుంది. కానీ ఈ వైఫల్యాన్ని పశ్చిమదేశాలు మీడియా అంగీకరించడానికి సిద్ధంగా లేదు. యుద్ధానికి కారణాలు ఏమైనా అవస్థలు మాత్రం రెండుదేశాల పౌరులతోపాటు ప్రపంచమంతా ఏదోరూపంలో అనుభవిస్తున్నారు అనేది కఠిన వాస్తవం. ఆ దేశాలతో పాటు ప్రపంచానికంతటికి ఎంత త్వరగా ముగింపు జరిగితే అంతమంచిది. యుద్ధం పరిష్కారంకోసం ప్రపంచం ఎదురుచూస్తోంది. రష్యా సేనలు ఉక్రెయిన్ దళాలని నిలువరించ గలిగాయి. ఉక్రెయిన్ రష్యా మోహరించిన శక్తిమంత యుద్ధ సరంజామాని తొలగించి చొచ్చుకుపోతున్నది. రష్యాతో పోల్చితే ఉక్రెయిన్ సైన్యం పరిమితం. వారిని కోల్పోతే పరిస్థితి మరింత అధ్వానం అవుతుంది. అందువలన ఆచితూచి వ్యవహరిస్తోంది. లేకుంటే మరింత ప్రాణహాని ఉంటుంది. ఇంతలా పరిస్థితి ఉన్నప్పటికీ పశ్చిమ దేశాల రిపోర్టు మాత్రం ఆశావహంతో రష్యాని హెచ్చరిస్తూనే ఉన్నాయి.

ఈ పాక్షిక వ్యవహారశైలి ఒక యుద్ధానికి పరిమితంకాదు. ఇదే రీతిలో రష్యా ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో కూరుకు పోతుందని అక్కడ మేధావులు అంచనాలు వేశారు. ఉక్రెయిన్‌పై దాడి అనంతరం రష్యాపై పశ్చిమ దేశాలు ఆర్థిక ఆంక్షలు విధించాయి. ఈ ఆంక్షల కారణంగా రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఖజానా ఖాళీ అవుతుంది. 'పుతిన్'- ఎందుకు దాడి చేశానా?' అని పశ్చాత్తాప పడతాడని భావించారు. రష్యా జీడీపీ 2022లో 15శాతం పడిపోతుందని అంతర్జాతీయ ఆర్థికసంస్థ అంచనా. ఈ తరుగుదల 11శాతం అని ప్రపంచ బ్యాంకు, 8.5 శాతం అని అంతర్జాతీయ ద్రవ్య సంస్థ(ఐఎమ్ఎఫ్) వెల్లడించాయని పశ్చిమదేశాల మీడియా ఆనందంతో ప్రకటించింది.

కానీ వాస్తవానికి భిన్నంగా రష్యా జీడీపీ తగ్గింది 2022లో 2.2శాతం మాత్రమే. 2023 తొలి త్రైమాసికంలో 1.9శాతం, రెండో త్రైమాసికంలో 4.9 శాతం పెరిగింది. పూర్వ తగ్గిన పునిక వలన, కఠిన ఆంక్షలు నేపథ్యంలో ఇదిఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ ఆంక్షల కారణంగా రష్యా విదేశీ మారక నిల్వలు స్తంభించిపోయాయి. 'స్విఫ్ట్' సిస్టమ్ నుండి ఎలాంటి నగదు బదిలీచేయకుండా వారి ఆంక్షలతో బహిష్కరించారు. పశ్చిమ దేశాల పెట్టుబడులు నిలిచిపోయాయి. దాదాపు 3600పైగా రష్యా సంస్థలు అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్నాయి. 1800 పైగా సంస్థలు యూరోపియన్ ఆంక్షలు ఎదుర్కొంటున్నాయి. అయినా రష్యా స్థిరంగా

ఉండగలిగింది. అమెరికా, ఆస్ట్రేలియాలు రష్యా ఇంధన దిగుమతులు నిషేధించాయి. యూరోపియన్ యూనియన్ దేశాలు అధికంగా రష్యా చమురు, గ్యాస్‌లపై దీర్ఘకాలంగా ఆధారపడి ఉన్నాయి. అవి కొనుగోళ్లు సాగించక తప్పని పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. ఇండియా ఇతర తృతీయశ్రేణి దేశాలకు పెరిగిన పెట్రోల్‌ధరలు శరాఘాతమయ్యాయి. అయితే వారికి రష్యా చౌకఇంధనం అంది వచ్చిన అవకాశంగా తక్కువ ధరలతో లభ్యమవుతుంది. అదే రీతిలో చైనాకు, ఇతరులకు. రష్యా విదేశీ వాణిజ్యం మిగులుతో సాగుతుంది. ఆర్థిక ఆంక్షలతో తొలినాళ్లలో పతనమైన రూబుల్ క్రమేపీ యథాస్థితికి వచ్చింది. ఇంత జరుగుతున్నా పశ్చిమ మీడియా రష్యా ఆర్థిక కష్టాల గురించి వార్తలు వండి వార్చి వడ్డిస్తూ నే ఉంది. ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్త, ఆర్థికవేత్త, తత్వవేత్త 'నామ్ చోమ్స్కీ' మాటలు నిజమయ్యాయి.

ఈ సంవత్సరం తొలినాళ్ల నుండి యూరోపియన్ యూనియన్ రష్యా నుండి పైప్‌లైన్ల ద్వారా వచ్చే గ్యాస్‌ను ఆపేసింది. కానీ వారికి ఇది ఏమంత సమస్య కాలేదు. కారణం ఏమంటే రికార్డు స్థాయిలో రష్యా లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్(ద్రవరూప సహజ వాయువు) ను రికార్డుస్థాయిలో పైప్‌లైన్ల బదులు కంటైనర్ నౌకల ద్వారా దిగుమతి చేసుకుంటున్నాయి. కానీ పశ్చిమ మీడియాలో చెప్పేది- రష్యన్ల డేటాను, సామర్థ్యాలను ఎక్కువచేసి అతిశయంగా చెప్తుంటారు. బ్యాంక్ ఆఫ్ రష్యా ప్రకారం 2023లో జీడీపీ పతనం అంచనా 1.1శాతం. ప్రపంచబ్యాంకు, మోర్గాన్ స్టాన్లీలు అత్యంత సాధారణ తగ్గుదలను సూచించాయి. నిజానికి ఐఎమ్ఎఫ్ రష్యా సానుకూల వృద్ధిరేటు 0.7శాతంగా రివైజ్డ్ అంచనా వేసింది. 'ఐఎమ్ఎఫ్' 2023లో రష్యా వృద్ధిరేటు యూరోపియన్ యూనియన్ అగ్రదేశాల కన్నా మించి ఉంటుందని అంచనా వేసింది. ఇదే సంవత్సరంలో జర్మన్ జిడిపి 0.1 శాతం, బ్రిటన్ జిడిపి 0.3 శాతం తగ్గుతాయని పేర్కొంది. అదే సమయంలో రష్యా వృద్ధి 0.8 శాతం తక్కువ బేస్ ఉన్నప్పటికీ, అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలనడుమ రష్యా అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కొని వృద్ధి సాధించటం, ఇతర ఐరోపా దేశాల ఆర్థికస్థితి కన్నా మిన్నగా ఉండటం గమనార్హం.

రానున్న సంవత్సరంలో రష్యా జీడీపీ 1.8శాతం పెరుగుతుందని గోల్డ్‌మాన్ సాచెస్, జేపీ మోర్గాన్ అంచనా వేసింది. నిజానికి ఇది రష్యా అంచనా 1.5శాతం కన్నా కూడా ఎక్కువ. ఈ యుద్ధం కారణంగా అక్కడ విషమ సమస్యలు లేకపోలేదు. వాటి ప్రభావం వృద్ధిపై ఏదోరూపంలో పడకుండాను పోవడంలేదు. అయినా అక్కడ ప్రజల త్యాగాలు, పోరాటపటిమతో వీటిని అధిగమించగలరని నిరూపిస్తూనే ఉన్నారు. వాస్తవిక వివరాల కారణంగా పశ్చిమ దేశాలలోని మీడియా విశ్వసనీయత నానాటికి ప్రశ్నార్థకం అవుతుంది. అది చివరి 'నాన్న-పులి' కథలోగా మారినా ఆశ్చర్యంలేదు. నిష్పాక్షిక మీడియా సంస్థలు వాస్తవాలని, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తూనే ఉంటాయి. పౌరుల శ్రేయస్సు కొరకే నిరంతరం అన్ని విధాలా ప్రయత్నిస్తూనే ఉంటాయి. అయితే వాటి శాతం అత్యంత తక్కువగానే ఉంటూ ఉంటుంది. ప్రపంచ మానవుల శ్రేయస్సు దృష్ట్యా అది పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే వాస్తవాలు ఏవి కూడా విమర్శలకు, అనంగీకారమునకు అతీతం కాదు. ఈ కారణంగానే ఒకప్పటి అమెరికా అధ్యక్షుడు 'థామస్ జఫర్సన్' 'తాను ప్రభుత్వానికన్నా మీడియాకి అత్యధిక ప్రాధాన్యత నిస్తాను' అన్నది. ఇది ఎల్లప్పుడూ ఎక్కడ మీడియాకైనా స్ఫూర్తిదాయకం కావాలి.

సెల్: 9247499715

పోల్‌డ్యూటీ సిబ్బంది

ఫెసిలిటేషన్ కేంద్రాల్లోనే ఓటేయాలి

న్యూఢిల్లీ: ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మాత్రమే పోస్టల్ బ్యాలెట్‌లు వేయాలని న్యాయశాఖ తాజాగా నోటిఫికేషన్ జారీచేసింది. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది బ్యాలెట్ పేపర్‌ను ఎక్కువ కాలం తమ వద్ద ఉంచుకోవడం వల్ల అభ్యర్థులు లేదా రాజకీయ పార్టీల ద్వారా ప్రలోభాలకు, బెదిరింపులకు తావు ఉంటుందని, ఇతర అనైతిక మార్గాలకు అవకాశం ఉంటుందని, ఈ పద్ధతి దుర్వినియోగం కాకుండా ఉండాలంటే ఎన్నికల నియమావళి- 1961లో సవరణ జరగాలని న్యాయశాఖకు గతేడాది సెప్టెంబరులో ఈసీ సూచించింది. ఇదే క్రమంలో తాజా నోటిఫికేషన్‌ను న్యాయశాఖలోని లెజిస్లేటివ్ విభాగం జారీ చేసింది. కొత్తగా సెక్షన్ 18ఎను తీసుకొచ్చింది. ఈ సెక్షన్ ప్రకారం 'ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్‌ను ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే వేయాలి. దీని గురించి రాతపూర్వకంగా రిటర్నింగ్ అధికారికి సూచించాలి' అని ఉంది. ఆగస్టు 23వ తేదీ నుంచి ఈ సవరణ అమల్లోకి రావడంతో రాజస్తాన్, చత్తీస్‌గఢ్,

మిజోరం, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జరబోయే అసెంబ్లీ ఎన్నికల సమయంలో విధుల్లో ఉండే సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్లలోనే ఓటు వేయాల్సి ఉంటుంది. విధుల్లో ఉన్న సిబ్బందికి కౌంటింగ్ రోజు ఉదయం 8 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్‌కు సమయం ఉంటుంది కాబట్టి బ్యాలెట్లను వారు వెంట తీసుకెళడం, ఇంట్లో ఎక్కువ కాలం ఉంచుకోవడం వంటివి గత ఎన్నికలప్పుడు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎన్నికల కమిషన్ అనుసరించే పద్ధతి ప్రకారం సొంత నియోజకవర్గాల్లో కాకుండా వేర్వేరు చోట్ల ఎన్నికల

ఎన్నికల నిబంధనావళికి సవరణతో అమల్లోకి 18ఎ సెక్షన్

న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ

పర్యవేక్షణ, నిర్వహణ విధులను సిబ్బంది నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వారు తమ స్వస్థల్లాలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయలేరు. ఈ కారణంగానే పోస్టల్ బ్యాలెట్ల అవకాశాన్ని కల్పించారు. శిక్షణ సమయంలోనే రిటర్నింగ్ అధికారికి పోస్టల్ బ్యాలెట్ కోసం సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల సిబ్బంది ఓటేసేందుకు ఒక ఫెసిలిటేషన్ కేంద్రం ఉంటుంది. అభ్యర్థులు లేక వారి ప్రతినిధుల సమక్షంలో రహస్యంగా, పారదర్శకంగా ఓటింగ్ జరిగేలా ఫెసిలిటేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఉంటాయి. ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యే రోజు ఉదయం 8 గంటల లోపు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ రూపంలో రిటర్నింగ్ అధికారికి పంపే వెసులుబాటు సిబ్బందికి ఉంది. ఈ పద్ధతిని అనుసరించే చాలా మంది ఎన్నికల విధులు పూర్తిచేసుకున్న తర్వాత కూడా పోస్టల్ బ్యాలెట్లను తమ ఇళ్ల వద్ద ఎక్కువ కాలం ఉంచుకుంటారు. దీంతో వాటి దుర్వినియోగానికి అవకాశం కలుగుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల తొలి దశ ఏప్రిల్ 11న జరుగగా, ఓట్ల లెక్కింపు మే 23న జరిగింది. కాబట్టి విధులు ముగిసిన తర్వాత కూడా బ్యాలెట్లను తమ వద్ద ఉంచుకునేందుకు చాలా సమయం సిబ్బందికి లభించింది. పోస్టల్ బ్యాలెట్ పారదర్శకత, స్వేచ్ఛ ఎన్నికల ప్రక్రియకు ఇది విఘాతం కలిగిస్తుదని అధికార వర్గాలు వెల్లడించాయి.

నాలుగు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు లేవు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ సహా నాలుగు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగే అవకాశం లేదని అధికార వర్గాలు మంగళవారం సూచనప్రాయంగా వెల్లడించాయి. లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలపై ఎన్నికల కమిషన్, కేంద్ర న్యాయమంత్రిత్వశాఖలోని లెజిస్లేటివ్ డిపార్టుమెంటు పరస్పరం సంప్రదింపులు జరిపినట్లు తెలిపాయి. నిబంధనల ప్రకారం ఎన్నిక లేదా ఉప ఎన్నిక నిర్వహించాలా? వద్దా అనే అంశంపై ఈసీతో లెజిస్లేటివ్ డిపార్టుమెంటు సంప్రదింపులు జరిపింది. దేశంలో చంద్రాపూర్, పూనె, ఘాజీపూర్, అంబాలా లోక్‌సభలకు ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. ఏదైనా సీటు ఖాళీ అయితే ఆరు మాసాల్లోపే ఎన్నిక నిర్వహించడం ఈసీ బాధ్యత. అయితే, కొన్ని వాస్తవాల ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహించాలా? లేదా వాయిదా వేయాలా అనే అంశంపై నిర్ణయం తీసుకునే హక్కు ఎన్నికల కమిషన్‌కు ఉంటుందని తెలిపాయి. ఉప ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, కొత్తగా ఎన్నికైన సభ్యులకు ప్రజాప్రతినిధులుగా తక్కువ సమయం ఉంటుందని ఈసీ, మంత్రిత్వశాఖ చర్చించుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. 2014, 2019 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ మార్చిలోనే వెలువడిందని, 2024 ఎన్నికలు కూడా సమీపిస్తున్నందున ఉప ఎన్నికలు నిర్వహించకపోవడమే మంచిదనే అభిప్రాయం ఉన్నట్లు వెల్లడించాయి.

మను మనేసర్ అరెస్టు : వీహెచ్‌పీ

గురుగ్రామ్ : ఫిబ్రవరిలో ఇద్దరు ముస్లింలను హత్య చేసిన కేసులో గోసంరక్షకుడు మోను మనేసర్‌పై రాజస్థాన్ పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం అతన్ని అదుపులోకి తీసుకున్నారని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తెలిపింది. మోను మనేసర్ ఇటీవల నుహ్‌లో హింసను ప్రేరేపించాడని కొందరు ఆరోపించారు. బజరంగ్ దళ్ నాయకుడిని అదుపులోకి తీసుకున్నట్లు హరియానా పోలీసులు ధ్రువీకరించలేదు.

అయితే గురుగ్రామ్‌లోని మన్సేర్‌లో అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఆ గ్రూపు మాతృ సంస్థ విశ్వ హిందూ పరిషత్ ఆఫీస్ బేరర్ తెలిపారు. ఒక వీడియో క్లిప్ ఉద్దేశపూర్వకంగా సాదా దుస్తులు ధరించి ఉన్న మనేసర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఉంది. అతని అసలు పేరు మోహిత్ యాదవ్. ఆ వీడియో గురించి ప్రశ్నించగా, హరియాణా హోం శాఖ మంత్రి అనిల్ విజ్ మాట్లాడుతూ 'నేను ఆ వీడియోను చూశాను. అతను ఎక్కడా ప్రజలను అల్లర్లకు ప్రేరేపించలేదు.

యాత్రలో పాల్గొనమని ప్రజలను కోరుతున్నాడు' అని చెప్పారు. హింసలో మనేసర్ పాత్రపై కూడా విచారణ జరుపుతామని రాష్ట్ర పోలీసులు తెలిపారు.

చిన్నారికి అరుదైన వ్యాధి

రూ.10 కోట్లతో వైద్యం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం నజాఫ్‌గఢ్‌లో అరుదైన జన్యు వ్యాధి నుంచి కోలుకుంటున్న 18నెలల చిన్నారిని చూశారు. అతడి కుటుంబం వ్యాధి చికిత్స కోసం క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సేకరించింది. కనవ్ అనే చిన్నారి వెన్నెముక కండరాల క్షీణత (ఎస్ఎంఏ)తో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి కారణంగా కండరాలు బలహీనమవుతాయి. చివరికి జీర్ణక్రియ, గుండె కండరాలు, ఊపిరితిత్తులు సహా ఏదైనా కండరాల కదలికను నశింపజేస్తుంది. ఈ వ్యాధి చికిత్సకు రూ. 17.5 కోట్లు ఖర్చవుతుందని కేజ్రీవాల్ తెలిపారు. 'ఇది అరుదైన జన్యుపరమైన రుగ్మత. దేశంలో ఇలాంటి కేసులు కేవలం తొమ్మిది మాత్రమే ఉన్నాయి. దిల్లీలో ఈ వ్యాధికి సంబంధించిన మొదటి కేసు ఇది. కనవ్ తల్లిదండ్రులు... పిల్లల చికిత్స కోసం క్రౌడ్ ఫండింగ్ ప్రారంభించిన ఆప్ ఎంపీ సంజీవ్ అరోరాను సంప్రదించారు' అని కేజ్రీవాల్ విలేకరులకు చెప్పారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా రూ.10.5 కోట్లు సమీకరించామని, అమెరికా నుంచి డ్రగ్ తెప్పించామని చెప్పారు. చికిత్స తర్వాత, కనవ్ పరిస్థితి మెరుగుపడిందని, ఇప్పుడు అతను కూర్చుని తన అవయవాలను కదిలించగలడని చెప్పారు. ఖర్చుతో కూడుకున్న ఇంజక్షన్ కోసం కొందరు ప్రముఖులు, ఎంపీలు సహా డబ్బు విరాళంగా ఇచ్చిన వారందరికీ ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఔషధాన్ని రూ.10.5 కోట్లకు విక్రయించేందుకు అంగీకరించినందుకు అమెరికాకు చెందిన ఔషధ తయారీ సంస్థకు, ఈ ఔషధాన్ని దిగుమతి సుంకం నుండి మినహాయించినందుకు కేజ్రీవాల్ కేంద్రానికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

హిమాచల్‌కు సాయం చేయండి

వరద ప్రాంతాలను సందర్శించిన ప్రియాంక

సిమ్లా : కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కులులోని వరద బాధిత ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. రాష్ట్రం విపత్తు బారిన పడినందుకు 'రాజకీయాలకు' అతీతంగా సహాయం చేయాలని కేంద్రాన్ని కోరారు. అదే సమయంలో ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని ఎదుర్కొంటున్న స్ఫూర్తిని ప్రశంసించారు. కులు జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, సహాయ, పునరుద్ధరణ పనులను సమీక్షించిన ప్రియాంక, రాష్ట్రంలోని ప్రజలు ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన వారి కోసం విరాళాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారని, వర్షాల వల్ల కొట్టుకుపోయి లేదా కొండ చరియలు విరిగిపడి ఆటంకాలు ఏర్పడిన రోడ్లను పునరుద్ధరించడానికి 'శ్రమ దాన్' (శ్రమ దానం) కూడా చేశారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ లేదా బీజేపీ ప్రభుత్వం ఉందా లేదా అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం కూడా అదే భావనతో సహాయం చేయాలని అన్నారు. జులైలో భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లుతున్న బియాస్ నది కారణంగా దెబ్బతిన్న భుంతర్ వద్ద సంగం వంతెనతో సహా కులు నుంచి మనాలికి వెళ్లే మార్గంలో కాంగ్రెస్ నాయకురాలు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, మనాలిలోని ఆలూ మైదానంలో బాధిత ప్రజలతో సంభాషించారు. జులై 14, 15 తేదీల్లో కులు, మండి జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు, కొండచరియలు విధ్వంసం సృష్టించాయి. ఈ ఉదయం కులులోని భుంతర్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రియాంక అంతకుముందు కాంగ్రెస్ కార్యకర్తలు, యాపిల్ రైతులతో యాపిల్ ఉత్పత్తి, రవాణా సౌకర్యంపై మాట్లాడారు. అదానీ గ్రూప్ అందించే యాపిల్ బాక్సుల ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. అదానీ గ్రూప్ సేకరణ ధరను విడుదల చేసిన తర్వాత హిమాచల్ ప్రదేశ్‌లో యాపిల్ బాక్సులను మూడింట ఒక వంతు ధరకు విక్రయిస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు ఇటీవల ఆరోపించారని, వాటి కోసం ప్రధాని ఎందుకు ఏమీ చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. ప్రియాంక గాంధీ వాద్రా వెంట ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, మండి పార్లమెంటు నియోజకవర్గం నుంచి సిట్టింగ్ కాంగ్రెస్ ఎంపీ, ప్రజా పనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ ఉన్నారు. కాంగ్రెస్ నాయకురాలు మండి, సిమ్లా, సోలన్ జిల్లాలను కూడా సందర్శించనున్నారు. హిమాచల్ ప్రదేశ్ జూన్ 24 న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి సెప్టెంబరు 11 వరకు రూ.8,679 కోట్ల నష్టాన్ని చవిచూసింది. రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ కేంద్రం ప్రకారం, వర్షాలకు సంబంధించిన సంఘటనలలో 260 మందికి పైగా మరణించారు. ముఖ్యమంత్రి సుఖు రూ.12 వేల కోట్ల నష్టాన్ని అంచనా వేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో సంభవించిన వరదల బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు.

రైతుల హక్కుల పరిరక్షణకు భారత చట్టం ప్రపంచానికే ఆదర్శం: ముర్ము

న్యూఢిల్లీ: వాతావరణ మార్పుల సవాళ్ల నడుమ మొక్కల రకాలు, రైతుల హక్కుల పరిరక్షణపై భారతదేశ చట్టం మొత్తం ప్రపంచానికి ఆచరణీయంగా మారిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. దేశ రాజధానిలోని పూసా కాంప్లెక్స్‌లో మంగళవారం రైతుల హక్కులపై జరిగిన మొట్టమొదటి అంతర్జాతీయ సదస్సును ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ... ముందుగా 2001లో మొక్కల రకాలు, రైతుల హక్కుల పరిరక్షణ చట్టం (పీపీవీఎఫ్ఆర్) తీసుకురావడంలో భారతదేశం ముందుందని అన్నారు. ఇది రైతులను రక్షించడానికి ఆహారం, వ్యవసాయం కోసం మొక్కల జన్యు వనరులపై అంతర్జాతీయ ఒప్పందానికి అనుగుణంగా ఉంటుంది. ఈ చట్టం ప్రకారం... భారత ప్రభుత్వం రైతులకు అనేక రకాల హక్కులను అందిస్తుంది. ఇందులో నమోదిత బ్రాండ్‌లేని రకం విత్తనాలను ఉపయోగించడం, తిరిగి ఉపయోగించడం, సంరక్షించడం, విక్రయించడం వంటివి ఉంటాయి. అంతేకాకుండా రైతులు తమ సొంత రకాలను నమోదు చేసుకోవచ్చని, వారికి రక్షణ లభిస్తుందని ఆమె తెలిపారు. ఇలాంటి చట్టం ప్రపంచం మొత్తం అమలు చేసేందుకు అర్హమైన, అద్భుతమైన నమూనాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్ల మధ్య, ఐక్యరాజ్యసమితి యొక్క సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చడానికి కూడా ఇది ప్రాముఖ్యతను సంతరించుకుందని రాష్ట్రపతి తెలిపారు. ప్లాంట్ అథారిటీ భవన్, మొక్కల రకాలను ప్రాసెస్ చేయడానికి ఆన్‌లైన్ పోర్టల్‌ను రాష్ట్రపతి ప్రారంభించారు. ఆమె ఆరు రైతు సంఘాలు, 20 మంది రైతులకు మొక్కల జన్యు రక్షక అవార్డులను ప్రదానం చేశారు. 2001లో ఆహారం, వ్యవసాయం కోసం మొక్కల జన్యు వనరులపై అంతర్జాతీయ ఒడంబడికను ఆమోదించిన తర్వాత తొలిసారిగా సెప్టెంబర్ 12-15 వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో భారతదేశం, విదేశాల నుంచి రైతులు సహా దాదాపు 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని అంచనా.

ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

న్యూఢిల్లీ : 'ఉపా' కేసులో జేఎన్‌యూ మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు మంగళవారం నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఫిబ్రవరి 2020లో జరిగిన ఈశాన్య దిల్లీ అల్లర్ల వెనుక కుట్రలో తన ప్రమేయం ఉందని ఆరోపిస్తూ ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా) కింద నమోదయిన కేసులో ఖలీద్ బెయిల్ పిటిషన్ దాకలు చేశాడు. ఈ అంశంపై వివరణాత్మక విచారణ అవసరమని న్యాయమూర్తులు అనిరుద్ధ బోస్, బేల ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'ఈ విషయంలో మేము డాక్యుమెంట్ల వారీగా వెళ్లాలి. అభియోగాలకు సంబంధించి లభ్యమైన సాక్ష్యాధారాలపై మీరు ఏదైనా ఫైల్ చేయండి' అని ఖలీద్ తరఫున హాజరయిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌కు ధర్మాసనం తెలిపింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆగస్టు 9న ఖలీద్ పిటిషన్‌పై విచారణ నుంచి తప్పుకున్నారు. ఈ విషయంలో తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన దిల్లీ హైకోర్టు అక్టోబరు 18, 2022 నాటి ఉత్తర్వులను సవాలు చేస్తూ ఖలీద్ దాఖలు చేసిన పిటిషన్ న్యాయమూర్తులు ఎ.ఎస్.బోపన్న, ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఖలీద్ ఇతర సహ నిందితులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాడని, అతనిపై వచ్చిన ఆరోపణలు ప్రాథమికంగా నిజమని పేర్కొంటూ ఖలీద్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద నిందితుడి చర్యలు 'ఉగ్రవాద చర్య'గా అర్హత పొందుతాయని హైకోర్టు పేర్కొంది. ఫిబ్రవరి 2020 అల్లర్లలో 53 మంది మరణించగా, 700 మందికి పైగా గాయపడినందుకు ఖలీద్, షర్జీల్ ఇమామ్, అనేక మందిపై తీవ్రవాద నిరోధక చట్టం (ఉపా), భారతీయ శిక్షాస్మృతిలోని అనేక నిబంధనల కింద కేసు నమోదయింది. పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ), జాతీయ పౌర నమోదు (ఎన్ఆర్‌సీ) కి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా హింస చెలరేగింది.

సూరత్ మేయర్‌గా బీజేపీ అభ్యర్థి మవానీ

అహ్మదాబాద్: అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సూరత్ మున్సిపల్ కార్పొరేషన్(ఎస్ఎంసీ) మేయర్‌గా బీజేపీ నేత దాక్షేశ్ మవానీ మంగళవారం ఎన్నికయ్యారు. మేయర్ పదవి కోసం తమ పార్టీలోకి ఫిరాయించిన కార్పొరేటర్లలో ఒకరి పేరును ఆప్ ప్రతిపాదించింది. కార్పొరేషన్ సమావేశానికి ముందు మేయర్, డిప్యూటీ మేయర్లుగా మవానీ, నరేంద్ర పాటిల్ పేర్లను ప్రతిపాదిస్తున్నట్లు బీజేపీ ప్రకటించింది. ప్రస్తుత మేయర్ హేమలి భోగవాలా రెండున్నరేళ్ల పదవీకాలం పూర్తికావడంతో మిగిలిన రెండున్నరేళ్ల కోసం ఎన్నిక అనివార్యమైంది. 120 మంది సభ్యులు గల కార్పొరేషన్‌లో బీజేపీకి 93 మంది కార్పొరేటర్లు, ఉండగా ఆప్‌కు కేవలం 27 మంది మాత్రమే ఉన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవికి ధర్మేంద్ర వవలియా, నిరలి పటేల్ పేర్లను ఆప్ ప్రకటించింది. మేయర్ పదవికి ఎన్నిక జరగగా బీజేపీ అభ్యర్థి మెవానీకి 91 ఓట్లు, ఆప్ అభ్యర్థి వవలియాకు 23 ఓట్లు లభించాయి. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి పాటిల్‌కు 91 ఓట్లు, పటేల్‌కు 23 ఓట్లు లభించాయి. దీంతో బీజేపీ అభ్యర్థులు మేయర్, డిప్యూటీ మేయర్ పోస్టులు సాధించినట్లు ప్రకటించారు. వీరు రెండున్నరేళ్లు ఆ పదవుల్లో కొనసాగుతారు.

పార్లమెంటు సిబ్బంది యూనిఫారంపై 'కమలం'

ఇదేమి పిచ్చంటూ కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: 'సర్వం కమల మయం' అన్న రీతిలో బీజేపీ వ్యవహరిస్తోంది. బీజేపీ ఎన్నికల గుర్తు కమలం, రంగు కాషాయం. అధికారంలో కొనసాగడంతో ఈ గుర్తులను అన్ని చోట్లా ఉపయోగిస్తోంది. తాజాగా పార్లమెంటు సిబ్బందికి సంబంధించిన కొత్త యూనిఫారంపై పార్టీ ఎన్నికల గుర్తు 'కమలం' గుర్తును బీజేపీ ముద్రించినట్లు వార్తలు వెలువడ్డాయి. దీనిపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. పార్లమెంటు సిబ్బంది కొత్త యూనిఫారాలపై జాతీయ జంతువు పులి, జాతీయ పక్షి నెమలి కాకుండా కమలం గుర్తును ఎందుకు ముద్రిస్తున్నారని లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణిక్కం ఠాగూర్ మంగళవారం ప్రశ్నించారు. 'కమలం మాత్రమే ఎందుకు? నెమలి ఎందుకు కాదు? లేదా పులి గుర్తును ఎందుకు ముద్రించలేదు? ఓహో...అవి బీజేపీ ఎన్నికల గుర్తు కాదు కదా! సార్ ఓం బిర్లా...దీనికేమి సమాధానం చెబుతారు?' అని ప్రశ్నిస్తూ ఎక్స్‌లో మాణిక్కం ఠాగూర్ పోస్టు చేశారు. మరీ ఇంతటి చిల్లర రాజకీయాలేమిటని ఆయన ప్రశ్నించారు. జీ 20 శిఖరాగ్ర సమావేశాలకు బీజేపీ ఇలాగే వ్యవహరించిందని, ఇప్పుడు పార్లమెంటు సిబ్బంది యూనిఫారాలపైనా కమలం ముద్రిస్తోందని ఆరోపించారు. ఇలాంటి సంకుచిత స్వభావంతో బీజేపీకి ఒరిగే ప్రయోజనమేమీ లేదని సూచించారు.

పూసేవాలి గ్రామంలో ప్రశాంత పరిస్థితి

పూనె: మహారాష్ట్రలోని సతారా జిల్లా పూసేవాలి గ్రామంలో ప్రశాంత పరిస్థితి నెలకొంది. మతపరమైన రెండు రోజుల క్రితం ఈ గ్రామంలో చోటుచేసుకున్న హింసాకాండలో ఒకరి ప్రాణాలు కోల్పోగా... 10 మంది గాయపడ్డారు. మంగళవారం పరిస్థితి అదుపులో ఉందని, అయితే ముందుజాగ్రత్తగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ మహారాష్ట్రలోని సతారా జిల్లా ప్రధాన కార్యాలయానికి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న పూసేవాలి గ్రామంలో ఆదివారం రాత్రి సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్ట్‌పై రెండు వర్గాల వారు ఘర్షణకు దిగారు. రంగంలోకి దిగిన పోలీసులు 23 మందిని అరెస్టు చేశారు. అల్లరి మూక కొన్ని ఇళ్లు, వాహనాలకు నిప్పుపెట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని సతారా పోలీసు అధికారి మంగళవారం తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలను పోస్ట్ చేయడంపై విచారణ జరుగుతోందని చెప్పారు. కొన్ని సంస్థలు మంగళవారం సతారా నగరంలో మౌన ప్రదర్శన చేపట్టడానికి ప్రయత్నించడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి... శనివారం వరకు వాయిదా వేయమని అభ్యర్థించారు. అభ్యంతరకర పోస్ట్‌కు సంబంధించి... దానిని అప్‌లోడ్ చేసిన యువకులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఐపీసీ సెక్షన్ 295ఎ (మతం లేదా మత విశ్వాసాలను అవమానించడం ద్వారా మతపరమైన భావాలను రెచ్చగొట్టే ఉద్దేశ్యంతో ఉద్దేశపూర్వకంగా హానికర చర్యలు) కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

అక్టోబరు 30 నుంచి అవినీతి వ్యతిరేక వారోత్సవం

CENTRAL VIGILANCE COMMISSION

న్యూఢిల్లీ : కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) అవినీతి వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అక్టోబరు 30 నుంచి నవంబరు 5 వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను పాటించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు పేర్కొన్నాయి. అవినీతి వ్యతిరేక వారోత్సవం 2023 సందర్భంగా సమగ్రత, నైతికత ప్రాముఖ్యతను నొక్కిచెప్పే వివిధ కార్యకలాపాలలో యువతను నిమగ్నం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సెప్టెంబరు 11 నాటి ఉత్తర్వులో పేర్కొంది. 'యువతను భాగస్వామ్యం చేసే కార్యకలాపాలను సంస్థలు ప్రోత్సహించాలి, అవినీతిపై పోరాటంలో వారి ప్రమేయం ప్రాముఖ్యతను పునరుద్ఘాటించే వాతావరణాన్ని పెంపొందించాలి' అని తెలిపింది. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం దేశం సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి ప్రాథమిక మార్గాలలో ఒకటిగా సీవీసీ పేర్కొంది. 'భారతదేశం అత్యున్నత సమగ్రత సంస్థగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, ప్రజా పరిపాలనలో సమగ్రతను నిర్ధారించే దిశగా వివిధ కార్యక్రమాలను అవలంబిస్తుంది. అవినీతి ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడంలో కమిషన్ సాధనాల్లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ఒకటి' అని వెల్లడించింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (అక్టోబరు 31) వారంలో ప్రతి సంవత్సరం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహిస్తారు. ఈ సంవత్సరం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను అక్టోబరు 30 నుంచి నవంబరు 5 వరకు నిర్వహించాలని సీవీసీ నిర్ణయించింది. 'అవినీతికి నో చెప్పండి. దేశానికి కట్టుబడి ఉండండి' అని ఉత్తర్వులు పేర్కొన్నాయి. అక్టోబరు 30న మంత్రిత్వ శాఖలు, విభాగాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈఎస్), ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు), అన్ని ఇతర సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగులు సమగ్రత ప్రతిజ్ఞ చేయడంతో వారం ప్రారంభమవుతుందని వెల్లడించింది. భాగస్వామ్య విజిలెన్స్ నిజమైన స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో, కమిషన్ ముందుగా మూడు నెలల ప్రచార వ్యవధిని (ఆగస్టు 16 నుంచి నవంబరు 15 వరకు) వివరించే సూచనలను జారీ చేసింది. 'ప్రభుత్వ పాలనలో పారదర్శకత, సమగ్రత ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో అన్ని సంస్థలు విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహించడం అత్యవసరం' అని పేర్కొంది.

25 నుంచి 27 వరకు బాపట్లలో

వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర మహాసభలు

- 10 వేల మందితో కూలిదండు మహాప్రదర్శన, బహిరంగసభ
- సాగుభూములు, సామాజిక న్యాయం, ఉపాధి సాధనే లక్ష్యంగా కార్యాచరణ
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో–బాపట్ల:

రెక్కల కష్టంపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు సాగుభూమి, ఉపాధి, కనీస వేతనం, సామాజిక న్యాయం లక్ష్యంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) 22వ రాష్ట్ర మహాసభలు ఈనెల 25 నుంచి 27 వరకు బాపట్లలో జరగనున్నాయని, అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, ఉద్యోగులు, కార్మిక, వ్యాపార వర్గాలు మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కోరారు. బాపట్ల పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ముఖ్యనాయకుల సమావేశం మంగళవారం జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ దేశ సంపద వృద్ధికి కారణమైన పేదలు నేటికీ కరువు కోరల్లో కొట్టుమిట్టా డుతున్నారని, తరతరాలుగా అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంటరానితనం వంటి సాంఘిక పీడన, న్యాయమైన కూలీరేట్లు ఇవ్వని భూస్వామ్య పెత్తందారీ దోపిడీ నుండి విముక్తి కోసం 90 సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆవిర్భవించిందన్నారు. జమిందారీ, జాగీర్దారీ విధానాల రద్దుకు, భూస్వామ్య పెత్తందారీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, న్యాయమైన కూలీరేట్ల సాధనకు, భుక్తి కోసం, సామాజిక గౌరవం కోసం, దున్నేవాడిదే భూమి నినాదంతో నైజాం నవాబు నిరంకుశ పాలనకు, భూస్వాములకు వ్యతి రేకంగా గ్రామీణ శ్రమ జీవులను సమీకరించి చైతన్యపరచి మహోద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందన్నారు. ప్రత్యక్ష భూ పోరాటాల ద్వారా లక్షలాది ఎకరాల ప్రభుత్వ బంజరు భూములు, మిగులు భూములను పేదలకు పంచిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉందని విల్సన్ చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం, కమ్యూనిస్టు పార్టీ పోరాటాల కారణంగా కోనేరు రంగారావు భూకమిటీ ఏర్పాటు చేశారని, ఆ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించేలా ఉద్యమించామన్నారు. గ్రామీణ పేదల రక్షణ, సంక్షేమం కోసం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘానికి ఐక్యరాజ్య సమితి సమాచార పత్రంలో స్థానం లభించిందని, అందుకుగాను సంఘ నిర్మాతల త్యాగచరిత్రను స్మరించుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం స్ఫూర్తితో అమరులు చంద్ర రాజేశ్వరరావు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమనేత గుజ్జుల యలమందారెడ్డి తోడ్పాటుతో దేశవ్యాపితంగా ఉన్న గ్రామీణ కష్టజీవుల కోసం భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ)ను ఏర్పాటు చేసినట్లు జల్లి విల్సన్ వివరించారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీ కూలీలకు రక్షణ, ఆత్మగౌరవం కోసం కొండంత అండగా సంఘం నిలబడిందని తెలిపారు.

ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పడిన నూతన బాపట్ల జిల్లాలో అమరులు పుచ్చలపల్లి సుందరయ్య, గుజ్జుల యల మందారెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, బొమ్మగాని ధర్మభిక్షం, కోంద్రు సుబ్బారావు, స్వర్ణ వేమయ్య, చల్లపల్లి నారాయణరావు, కాబోతు రామస్వామి, తురిమెళ్ల గోవిందయ్య, గొరికపూడి జోసఫ్, జేఎస్ఆర్ ఆంజనేయశాస్త్రి, రజబ్ అలీ, భూపతి వెంకట నర్సయ్య, గుండా మల్లేశ్, యన్.ఈశ్వరరెడ్డి, పెనకలపాటి వెంగమనాయుడు, వేములపల్లి శ్రీకృష్ణ, బావిరెడ్డి వెంకటేశ్వర రావు, పెరవలి శ్రీరాములు వంటి ఎందరో మహానుభావులు సారధ్యం వహించిన వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభ బాపట్లలో జరుపుకోవటం ఆనందంగా ఉందని జల్లి విల్సన్ అన్నారు. ఐదు లక్షల సంఘ సభ్యత్వానికి నాయకత్వం వహిస్తున్న 500 మంది ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర నాయకులు మహాసభలో పాల్గొంటారని తెలిపారు. 25వ తేదీ మొదటి రోజు 10 వేలమందితో కూలిదండు మహా ప్రదర్శన, బహిరంగసభ జరుగుతుందన్నారు. రాష్ట్ర మహా సభలలో వ్యవసాయ కార్మిక, దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సమస్యలపై, ముఖ్యంగా ఉపాధి, సాగుభూములు, సామాజిక న్యాయం కోసం పోరాటాలు చేసేందుకు మహాసభ వేదికగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించి, కొనసాగించే విధంగా ప్రణాళిక చేయనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేబీ శ్రీధర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి ఈశ్వరరావు, ఏఐవైఎఫ్ నేత షేక్ సుభానీ, ఏఐఎస్ఎఫ్ నేత బందెల నాజర్‌జీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్య దర్శి బత్తుల శామ్యూల్, బాపట్ల, చీరాల, అద్దంకి నియోజకవర్గ కార్యదర్శులు దుండి కనకారెడ్డి, చిరమల ప్రకాశ్, తుమ్మల పూర్ణచంద్రశేఖర్, ఆహ్వాన సంఘం కోశాధికారి ముత్తిరెడ్డి శ్రీనివాస్, బాపట్ల పట్టణ కార్య దర్శి బక్కా వెంకటరామ కృష్ణారెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు షేక్ కాలేషాగారి ఖాదర్‌బాషా, గర్నెపూడి ప్రసాద్, సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు మేదా వెంకట్రావు, సన్నమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బెంగాల్ బీజేపీలో కుమ్ములాటలు

- పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి నిర్బంధం
- కార్యకర్తల ఆందోళన, ఉద్రిక్తత

బంకుర:

పశ్చిమ బెంగాల్‌లోని బీజేపీలో కుమ్ములాటలు తెరపైకొచ్చాయి. ఆ పార్టీకి చెందిన కేంద్రమంత్రిపై బీజేపీకి చెందిన అసంతృప్తిపరుల వర్గం దాడికి దిగింది. కేంద్రమంత్రిని పార్టీ కార్యాలయంలో బంధించి ఆయన పనితీరుపై అక్కసు వెళ్లగక్కింది. నిరంకుశ నేత అని, సొంతవాళ్లకే పదవులు ఇచ్చుకుంటారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసింది. కేంద్ర సహాయ మంత్రి, బంకురా ఎంపీ సుభాష్ సర్కార్‌ను బంకురాలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు బంధించిన ఘటన మంగళవారం జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంటలకు సర్కార్ అధ్యక్షతన సమావేశం జరుగుతుండగా కొందరు కార్యకర్తలు నినాదాలు చేస్తూ పార్టీ జిల్లా కార్యాలయం వద్దకు చేరుకొని దానిని ముట్టడించారు. అనంతరం కేంద్రమంత్రిని లోపల పెట్టి తాళం వేశారు. నిబద్ధతగల కార్యకర్తలను పక్కకు పెట్టి సన్నిహితులకు జిల్లా కమిటీలో సభ్యులుగా చేయడాన్ని నిరసించారు. తమలో కొందరికి షోకాజ్‌లు ఇచ్చారని, పార్టీని పరిరక్షించేందుకు ఆందోళన చేస్తున్నామని చెప్పారు. అసమర్థ నేత (కేంద్రమంత్రి ని ఉద్దేశించి) కారణంగానే బంకురా మున్సిపాలిటీలో బీజేపీ గెలవలేదన్నారు. గతంలో రెండు స్థానాల్లో గెలిచిందని చెప్పారు. చాలా పంచాయతీ స్థానాల్లో అభ్యర్థులను నిలబట్టలేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇంతలో బీజేపీ కార్యకర్తల మరో బృందం అక్కడకు రావడంతో ఘర్షణ జరిగింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి కేంద్రమంత్రిని విడిపించారు. ఈ ఘటనను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామిక్ భట్టాచార్య ఖండించారు. ఇలాంటివి పార్టీ క్రమశిక్షణను దెబ్బతీస్తాయని, ప్రమేయం ఉన్న కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యవహాల్లో సర్కార్ పాత్ర లేదని, మనస్పర్థలతో ఈ పరిస్థితి తలెత్తిందని చెప్పారు. ఈ ఘటన వీడియోను ఎక్స్ మాధ్యమంలో పంచుకున్న టీఎంసీ... బీజేపీలో అంతర్గత కమ్ములాటలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ప్రస్తుతం తారస్థాయికి చేరుకున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఆ పార్టీలో ఐక్యత అన్నది మిథ్య' అని దుయ్యబట్టింది.

నేటి నుంచి టీడీపీ రాష్ట్రవ్యాప్త రిలే దీక్షలు

- ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించిన నేతలు
- 'బాబుతో నేను' లోగో ఆవిష్కరణ
- కేసులకు భయపడొద్దు: బాలకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల్లో టీడీపీ సమావేశాలు నిర్వహించింది. ఈ సందర్భంగా నేతలు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు నాయుడు తిరిగి ప్రజాక్షేత్రంలోకి వచ్చేవరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. స్థానిక నాయకుల అభిప్రాయాలు తీసుకుని వాటిపై తీర్మానాలు రూపొందించారు. ఈ సందర్భంగా బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రిలే నిరాహారదీక్షలు చేయాలని, రోజుకు ఒక మండలం చొప్పున అన్ని మండలాల నాయకులతో ఒక చోట సామూహిక నిరాహార దీక్షలు చేయాలని నిర్ణయించారు. అనంతరం చంద్రబాబు నాయుడుకు మద్దతుగా 'బాబుతో నేను' అనే లోగోను నేతలు ఆవిష్కరించారు. సమావేశం అనంతరం నేతలు, కార్యకర్తలు బయటకు వచ్చి నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించి మీడియాలో జగన్ సైకో చర్యలను ఎండగట్టారు. చిత్తూరు జిల్లలో సమావేశం నిర్వహించినందుకు టీడీపీ నేతలకు పోలీసులు నోటీసులు అందించారు. మరో వైపు విశాఖపట్టణంలో నిరసన తెలుపుతుండగా పోలీసులు అడ్డుకుని నాయకులు, కార్యకర్తలను స్టేషన్‌కు తరలించారు. ఈ సమావేశాల్లో పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, నిమ్మకాయల చినరాజప్ప, నక్కా ఆనందబాబు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బోండా ఉమామహేశ్వరరావు, ఎన్ఎండీ ఫరూక్, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, పార్లమెంటు అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

ఎన్ని కేసులు పెట్టినా పోరాడదాం: బాలకృష్ణ

దుర్మార్గుల దుష్ట రాజకీయాలు పెచ్చు మీరినప్పుడు, నీతిపరులు కష్టాల పాలైనప్పుడు ప్రజలు ఆగ్రహించకపోతే భవిష్యత్ పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణ అన్నారు. గుంటూరు ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్యనేతల సమావేశంలో పాల్గొన్న బాలకృష్ణ అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసిన ఈ దుష్ట ప్రభుత్వం, మరిన్ని అరెస్టులకు సిద్ధమవుతోందని, ఏం జరిగినా... ఎన్ని కేసులు పెట్టినా ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ప్రజాక్షేత్రంలోకి దిగడానికి తాను సిద్ధమయ్యాయని చెప్పారు. ప్రజల కోసం, రాష్ట్రం కోసం పోరాడటానికి సిద్ధం కావాల్సిన తరుణం ఆసన్నమైందని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనకు పరాజయం తప్పదన్న భయంతోనే జగన్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడన్నారు. జగన్ 16 నెలలు జైల్లో ఉన్నాడని, అందువల్ల, చంద్రబాబును కూడా కనీసం 16 రోజులైనా జైల్లో పెట్టాలన్న దురుద్దేశంతోనే తప్పుడు ఆధారాలతో ఫేక్ స్కామ్ సృష్టించారు. యువత భవిత కోసం చేపట్టిన గొప్ప ప్రాజెక్టును ప్రభుత్వం తన కుట్ర రాజకీయాలతో నీరుగార్చే ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. నిజంగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగితే, ప్రాజెక్టు అమలు, నిర్వహణ బాధ్యతలతో పాటు నిధులు విడుదల చేసిన అధికారులను ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు.

ఎన్డీటీవీ ప్రధాన విలేకరి రాజీనామా

ముంబై:

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ముంబైలో అదానీపై నిర్వహిస్తున్న పత్రికా విలేకరుల సమావేశాన్ని ఎలాగైనా విచ్ఛిన్నం చేయాలని అదానీ అధీనంలోని ఎన్డీటీవీ ముంబైలోని తన ప్రధాన విలేకరి సోహిత్ మిశ్రాని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని పాటించడం వృత్తి ధర్మం కాదనుకున్న సోహిత్ మిశ్రా తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. రాహుల్ నిర్వహించే విలేకరుల సమా వేశంలో రగడ సృష్టించాలని సోహిత్ మిశ్రాను ఎన్డీటీవీ ప్రధాన సంపాదకుడు సంజయ్ పుగాలియా ఆదేశించారని న్యూస్ లాండ్రీ వార్తా సంస్థ తెలిపింది. అదానీ ఎన్డీటీవీని స్వాధీనం చేసుకున్న తరవాత అనేక మంది ప్రసిద్ధ పత్రికా రచయితలు ఆ చానల్ వదిలి వెళ్లారు. సోహిత్ మిశ్రా రాజీనామాతో ఆ నిష్క్రమణలు కొనసాగుతున్నాయని అర్థం అవుతోంది.

అంతరిక్ష పరిశోధనల్లో

వర్సిటీల తోడ్పాటు పెరగాలి

ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరీరంగన్



బెంగళూరు:

అంతరిక్ష రంగ పరిశోధనల్లో విశ్వవిద్యాలయాల తోడ్పాటు మరింత పెరగాలని ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరీరంగన్ అన్నారు. ఎయిరోనాటిక్స్, ఎయిరోస్పేస్ విభాగాలను ఇంకా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పీటీఐతో మాట్లాడిన ఆయన అంతరిక్ష రంగంలో పెట్టుబడులు మరో రెండు నుంచి మూడు రెట్లు పెరుగవచ్చని దీమా వ్యక్తంచేశారు. ఈ రంగంపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టడంతో నిధుల కొరతకు ఆస్కారం ఉండదన్నారు. ఉత్తమ ఎయిరోనాటిక్స్‌ను ఎయిరోస్పేస్ రంగంలో పనిచేసేవారిని తయారు చేసే విధంగా ఉత్తమ విద్యా వ్యవస్థలు ఉండాలని సూచించారు. చాలా వర్సిటీల్లో ఎయిరోనాటిక్స్, ఎయిరోస్పేస్ విభాగాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందుకోసం అవసరమైతే ఇస్రో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా తన వంతు తోడ్పాటు అందించాలని సూచన చేశారు. యూనివర్సిటీల్లో పరిశోధనల స్థాయి పెంచడం కూడా అవశ్యమని రంగన్ చెప్పారు. '80శాతం మంది విశ్వవిద్యాలయాలకు వెళతారు కాబట్టి యువమేథో సంపతి అక్కడ ఎక్కువగా ఉంటుంది. దానిని మెరుగుపర్చుకోవాలి. పరిశోధనలు, విద్య, ఆవిష్కరణలు, పారిశ్రామికీరణ ద్వారానే అది సాధ్యమవుతుంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్, ఆథరైజేషన్ సెంటర్ (ఇన్–స్పేస్), న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) వంటివి సత్ఫలితాలు ఇస్తున్నాయని, వీటి వల్ల మిషన్లతో పాటు ఆదాయం, ఆదాయ మార్గాలు పెరుగుతున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం తోడ్పాటుతో అంతరిక్ష కార్యక్రమాలలో పురోగతి ఉందని, వీటికి భవిష్యత్‌లోనూ నిధుల కొరత ఉండబోదని చెప్పారు. ప్రస్తుతానికి అంతరిక్ష రంగంలో ఏటా రెండు, మూడు బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెడుతుండగా ఇది మరో రెండు లేక మూడు రెట్లు పెరిగేందుకు అవకాశం మెండుగా ఉందని కస్తూరీ రంగన్ వెల్లడించారు.

ఏపీలో 27 లక్షల ఓట్ల తనిఖీ

- 1,57,939 ఇళ్లల్లో 10 కంటే ఎక్కువ ఓటర్లు
- ఎంపీ రఘురామ లేఖపై స్పందించిన ఈసీ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకే డోర్ నంబర్‌లో 10మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాల సంఖ్య 1,57,939గా ఎన్నికల సంఘం తేల్చింది. ఇందులో 24,61,676 మంది ఓటర్లు ఉంటున్నట్టుగా తేలిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి ఎంపీ రఘురామ కృష్ణ రాజు రాసిన లేఖ మేరకు ఏపీలో ఓటర్ల సంఖ్యపై ఏపీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సమాధానం ఇచ్చారు. గుర్తు తెలియని డోర్ నంబర్లు, జీరో నంబర్లపైనా 2,51,767 మంది ఓటర్లు నమోదు అయి ఉన్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. మొత్తంగా ఏపీలో 27 లక్షల 13 వేల పైచిలుకు ఓట్లకు సంబంధించిన తనిఖీ జరుగుతున్నట్టు సీఈఓ ముఖేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఒకే డోర్ నంబర్, జీరో డోర్ నంబర్ సహా ఒకే ఇంటి నంబరుపై 10 మంది ఓటర్లు కలిగిన కేసుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని స్పష్టం చేశారు. బీఎల్ఓలు వెరిఫికేషన్ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నట్టు తెలిపారు. మరోవైపు నకిలీ, జీరో డోర్ నంబర్ కు సంబంధించిన ఓటర్ జాబితాల తనిఖీ ప్రక్రియలో ఇప్పటి వరకూ 61,374 ఓట్లు సరిచేశామని పేర్కొన్నారు. మిగతా 1,90,393 ఓట్లను తనిఖీ చేయాల్సి ఉందని వెల్లడించారు. సింగిల్ డోర్ నంబరుపై 10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న లక్షా 57 వేల గృహాలకుగానూ 21, 347 గృహాల తనిఖీ పూర్తి అయ్యిందని సీఈఓ స్పష్టం చేశారు. దొంగ ఓట్ల ఏరివేతకు చర్యలు చేపట్టామని లేఖలో వివరించారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

కాల్పుల్లో ముగ్గురు గిరిజనుల మృతి

ఇంఫాల్:

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం మరోసారి అక్కడ హింస చెలరేగింది. కాంగ్‌పోకి జిల్లాలో నిషేధిత తీవ్రవాద గ్రూపులు రెచ్చిపోయాయి. మంగళవారం ఉదయం కుకీ–జో వర్గానికి చెందిన ముగ్గురు గిరిజనులను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపినట్లు అధికారులు తెలిపారు. ముష్కరులు వాహనంలో వచ్చి ఇంఫాల్ వెస్ట్, కాంగ్‌పోక్పి జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ఇరెంగ్, కరం ప్రాంతాల మధ్య గ్రామస్తులపై దాడి చేసినట్లు చెప్పారు. ఉగ్రవాదుల దాడిలో ముగ్గురు గిరిజనులు ప్రాణాలు కోల్పోయినట్లు వారు వెల్లడించారు.

విస్తృత ధర్మాసనానికి 'రాజద్రోహం' కేసులు: సుప్రీం

న్యూఢిల్లీ:

రాజద్రోహం చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఐదుగురు జడ్జిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలని సుప్రీం కోర్టు మంగళవారం సిఫార్సు చేసింది. వలసవాద నాటి ఐపీసీ, సీఆర్పీసీ, ఆధారాల చట్టం స్థానంలో తెచ్చే కొత్త బిల్లును పార్లమెం టులో కేంద్రం ప్రవేశపెట్టిన నెల రోజుల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం తాజా విచారణను చేపట్టింది. శిక్షా స్మృతి నిబంధనల్లో సవరణల నేపథ్యంలో విస్తృత ధర్మాసనానికి ఈ కేసులను సిఫార్సు చేయడాన్ని వాయిదా వేయాలన్న కేంద్రప్రభుత్వ అభ్యర్థనను ధర్మా సనం తిరస్కరించింది. ఐపీసీలోని సెక్షన్ 124ఏ (రాజద్రోహం) శాసన పుస్తకాల్లో కొనసాగడాన్ని త్రిసభ్య ధర్మాసనం గుర్తించింది. కొత్త బిల్లు చట్టంగా మారితేగనుక అది భవిష్యత్ దృక్పథంతోనే ఉంటుంది గానీ పునరాలోచన చేసే పరిస్థితి ఉండదని పేర్కొంది. ఈ క్రమంలో కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు తగు నిర్ణయం కోసం సీజేఐ ఎదుట సంబంధిత పత్రాలను ఉంచాలని రిజిస్ట్రీకి కోర్టు ఆదేశాలు జారీచేసింది.

వన్డేల్లో 10 వేల పరుగులు...

దిగ్గజాల సరసన రోహిత్

కొలంబో:

భారత కెప్టెన్ రోహిత్ శర్మ భారీ రికార్డు సాధించాడు. వన్డేల్లో 10వేల పరుగుల మైలు రాయిని సొంతం చేసుకున్నాడు. ఆసియా కప్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన సూపర్ 4 మ్యాచ్‌లో రోహిత్ ఈ రికార్డు నెలకొల్పాడు. కసున్ రజిత ఓవర్లో లాంగాఫ్‌లో భారీ సిక్స్ బాది 10 వేల పరుగులను పూర్తి చేసుకున్నాడు. దాంతో, టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ తర్వాత తక్కువ ఇన్నింగ్స్‌ల్లో ఈ క్లబ్‌లో చేరిన రెండో క్రికెటర్‌గా గుర్తింపు సాధించాడు. హిట్‌మ్యాన్ 241 ఇన్నింగ్స్‌ల్లో 10 వేల పరుగులు చేయగా... కోహ్లీ మాత్రం 205 ఇన్నింగ్స్‌ల్లోనే 10 వేల పరుగుల మైలు రాయికి చేరాడు. అంతేకాదు భారత జట్టు తరఫున ఈ ఫీట్ సాధించిన ఆరో క్రికెటర్‌గా రోహిత్ నిలిచాడు. హిట్‌మ్యాన్ కంటే ముందు సచిన్ టెండూల్కర్(18,426), విరాట్ కోహ్లీ (13,024) సౌరభ్ గంగూలీ(11,363), రాహుల్ ద్రవిడ్ (10,889), ఎంఎస్ ధోనీ(10,773)లు ఈ ఫీట్ సాధించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ మైలు రాయికి చేరిన 15వ ఆటగాడిగా హిట్‌మ్యాన్ గుర్తింపు తెచ్చుకున్నాడు. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర (14,234), ఆసీస్ లెజెండ్ రికీ పాంటింగ్ (13,704), సనత్ జయసూర్య (13,430), మహేల జయవర్దనే (12,650), పాక్ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్(11,739), దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ (11,579), వెస్టిండీస్ మాజీ విధ్వంసక ఓపెనర్ క్రిస్ గేల్(10,480), బ్రియాన్ లారా (10,405), లంక మాజీ ఓపెనర్ తిలకరత్నే దిల్షాన్(10,290)లు వన్డేల్లో 10 వేల పరుగుల క్లబ్‌లో చోటు దక్కించుకున్నారు. ఇప్పటి వరకు 248 వన్డే మ్యాచ్‌లు ఆడిన రోహిత్ శర్మ 30 సెంచరీలు, 51 అర్ధ సెంచరీలు సాధించాడు. అంతేకాక మూడు సార్లు వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన తొలి క్రికెటర్ కూడా అతనే. వన్డేల్లో రోహిత్ అత్యధిక వ్యక్తిగత స్కోర్ 264.

40వ వర్ధంతి

మీ మరణం అమరం | మీ సమరం అమరం

శ్రీ మామిళ్ళపల్లి మాలకొండయ్యగారు

ఉత్తమ కమ్యూనిస్టుగాను, మున్సిపల్ కౌన్సిలర్‌గాను సంజీవయ్యనగర్, మాలకొండయ్య కాలనీ, శారదాకాలనీ నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించి పీడిత ప్రజల హక్కుల కొరకు నిరంతరము పోరాడిన మీరు మమ్ములను వీడి 40 సం॥లు గడిచినవి. మీరు నడిపించిన బాట అమరం, 40వ వర్ధంతి సందర్భంగా ఇవే మా జోహార్లు.

డా॥ ఎం. అరుణ (కుమార్తె)
టి. సంతోష్‌కుమార్ (అల్లుడు)
డా॥ టి. విజయగౌరి (కుమార్తె)
అమిత్ కుమార్
మౌనిక & ఆకాష్ చౌదరి
ఎం.ఎస్. కృష్ణ (కుమారుడు)
ఎం. వేదవాణి (కోడలు)
వరుణ్ & అఖిల
రచన & శ్యామ్

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.